# 17

# "జ్ఞానులవలె నడుచుకొనుడి"

# (మొదటి భాగం)

## (5:15-33)

ఎఫెసీయులకు వ్రాయబడిన పత్రికలోని చివరి పెద్ద భాగంలో (ఎఫెసీయులకు 5:15–6:20), అపొస్తలుడైన పౌలు క్రైస్తవ సత్సంబంధములను నిర్వహించుటకు మరియు చెడుకు వ్యతిరేకంగా చేయబడుచున్న పోరాటంలో సుస్థిరంగా నిలిచియుండుటకు గల నిర్దిష్టమైన ప్రణాళికలను నివేదించుచున్నాడు. ఒక నిశ్చయమైన రీతిలో "నడుచుకొనుడి" అంటూ ఈ పత్రికలో ఇవ్వబడిన నాలుగవది మరియు చిట్టచివరిదైన ఆజ్ఞ 5:15లో తెలియజెప్పబడియున్నది.

### దేవుడు మరియు ఇతరులపై దృష్టి కేంద్రీకరించి జాగ్రత్తగా జీవించుట (5:15–21)

#### "సమయమును సద్వినియోగము చేసుకొనుము" (5:15, 16)

**15-16 దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి.**

**వచనములు 15, 16.** వారు నడుచుకొనుచుండవలసిన విధానము, లేక వారి జీవిత శైలి, గూర్చి ఎఫెసీయులకు చేయబడిన మొదటి మూడు బోధలు, పిలువబడిన పిలుపునకు "తగినట్లుగా," "ప్రేమ కలిగి," మరియు "వెలుగు సంబంధులవలె" నడుచుకొనుటకు సంబంధించినవై యుండినవి. నాలుగవ బోధ **జాగ్రత్తగా చూచుకొనుటకు** సంబంధించినదై యున్నది. "ఉండు" లేక "అవు" అని అనువదింపబడిన గ్రీకు విధివాచకము *blepete* అయియున్నది. పౌలు ప్రయోగించిన క్రియా పద రూపములో "నిరంతరము కొనసాగుచుండు లేక పునరావృతమగుచుండు చర్య" యిమిడి యున్నది.[1] "మానసికంగా వివేచించుట, గమనించుట, గోచరము గావించుకొనుట, యోచించుట, మననము చేయుట, శ్రద్ధ వహించు ఉద్దేశంతో చూచుట, తన జాగ్రత్త వహించుట" అనునది దానర్థమై యున్నది.[2] "జాగ్రత్త" అనునది *akribōs* యొక్క అనువాదమై యుండి "బహుగా కష్టపడుట, జాగ్రత్త వహించుట, మరియు శ్రద్ధాళువు" అవసరమై యుండు విషయంతో సంబంధము గలదై, "ఖచ్చితము" మరియు "నిర్దిష్టమునై" యున్నది.[3] దేవుని వాక్య నియమముల పరిధిలో నడుచుకొనుచుండునట్లు విశ్వాసి ఎడతెరిపిలేని శ్రద్ధ వహించవలసియున్నది. ఈ బోధ, "నీవు నిబ్బరముగలిగి జాగ్రత్తపడి బహు ధైర్యముగానుండి, నా సేవకుడైన మోషే నీకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమంతటి చొప్పున చేయవలెను. నీవు నడుచు ప్రతిమార్గమున చక్కగా

ప్రవర్తించునట్లు నీవు దాని నుండి కుడికిగాని యెడమకుగాని తొలగకూడదు" అని దేవుడు యెహోషువకు సెలవిచ్చిన విధివాచకము వంటిదై యున్నది (యెహోషువ 1:7). జ్ఞానుల వలె జీవించు సందర్భములో, అపొస్తలుని ఆదేశములు "యీ నా మాటలు విని వాటిచొప్పున చేయు ప్రతివాడును బండ మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును" అని యేసు పలికిన పలుకులను జ్ఞప్తికి తెచ్చుచున్నవి (మత్తయి 7:24).

"జాగ్రత్తగా చూచుకొనుడి" అనగా, **అజ్ఞానుల** బుద్ధిహీనతకు దూరముగా ఉంటూ **జ్ఞానుల** వలె **మీ సమయమును సద్వినియోగము చేసికొనుట** యని అర్థము. *exagorazomenoi* అను గ్రీకు అసమాపక క్రియాపదము, *exagorazō* యొక్క ఒక రూపముగా "ఒకని సొంతం కోసం వీలైనంత ఎక్కువగా కొనుట" అని అర్థమిచ్చుచున్నది,[4] మరియు "అమితోత్సాహము మరియు మేలు చేయుట సమయమును మన సొంతం చేసుకొనుటకు వెచ్చించు కొనుగోలు సొమ్మైనట్లు, మేలు చేయుటకు లభించు ప్రతి అవకాశమును వివేకముతోను పవిత్రతతోను ఉపయోగించుకొనుటయైయున్నదని" సూచించుచున్నది.[5]

**దినములు చెడ్డవి గనుక** మనము మన సమయమును సద్వినియోగము చేసికొనవలెనని ప్రోత్సాహకము ఇవ్వబడింది. అంతకు మునుపు, "వాయుమండల సంబంధమైన అధిపతి, అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతియైన వాని" (2:2) అధికారము క్రింద దుర్మార్గపు లోకము జీవించుచున్నదను వాస్తవము గూర్చి పౌలు ప్రస్తావించాడు. ఈ దుష్ట లోకంలో, క్రైస్తవులమైన మనము దేవుడు మనలను పిలిచిన పిలుపునకు తగిన జీవితము జీవించవలసియున్నది. సత్ క్రియలు చేయుటకు మనము మనకు అందుబాటులో నుండు ప్రతి అవకాశమును అనుకూలము గావించుకొనవలెను, "ఏలయనగా వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలను గావించుకొనవలెను, ఏలయనగా వాటియందు మనము మనకు అందుబాటులో నుండు ప్రతి అవకాశమును అనుకూలము గావించుకొనవలెను, ఏలయనగా వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము" (2:10). సమయము పరిమితమైనదైయున్నది, మేలు చేయుటకు అవకాశములు మెండుగా ఉన్నవి, అయితే చెడు విస్తారంగా ఉన్నది; కాబట్టి క్రైస్తవులు వారు క్రీస్తు యేసునందు ఏమైయున్నారో దానిని వీలైనంత కాలము సద్వినియోగము చేసికొనవలెను.

తరువాత, జ్ఞానుల వలె సమయమును సద్వినియోగము చేసికొనునట్లు, క్రైస్తవులు దేవుని చిత్తమును గ్రహించవలెననియు (5:17) ఆయన ఆత్మతో నింపబడి యుండాలనియు (5:18) పౌలు చూపించాడు.

### "దేవుని చిత్తము గ్రహించుకొనుడి" (5:17)

**17ఇందు నిమిత్తము మీరు అవివేకులు కాక ప్రభువుయొక్క చిత్తమేమిటో గ్రహించుకొనుడి.**

**వచనము 17.** ఎఫెసీ పట్టణ క్రైస్తవులు **దేవుని చిత్తమేమైయున్నదో గ్రహించవలసినవారై యుండిరి.** ఒకడు దుష్టమైనదైయున్న ఈ లోకంలో మేలు చేయుటకు వానికి అందుబాటులో నుండు అవకాశములను అనుకూలము గావించుకొనునట్లు, వాడేమి చేయవలెనని దేవుడు

కోరుచున్నాడో దానిని వాడు ఎరిగియుండవలెను. అజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె ఉండుటకు, వాడు దేవుని ఉపదేశములను తెలిసికొని యుండవలెను. పౌలు ఈ పత్రికలో ఎఫెసీయులకు ఉపదేశించినది వారికి "దేవుని చిత్తమును" సుపరిచితము చేయుటకు పెంపొందింపబడినదై యున్నది. వారు "సంపూర్ణ జ్ఞానమును ఆత్మ సంబంధమైన వివేకమును గలవారును, ఆయన చిత్తమును పూర్ణముగా గ్రహించువారునై యుండవలె"ననునది పౌలు కొలొస్సయుల కొరకు చేసిన ప్రార్థనయైయున్నది (కొలొస్సయులకు 1:9–12). కొలొస్సయులైతేనేమి, ఎఫెసీయులైతేనేమి, వారు దేవుని సత్యమును ఎరిగియుండవలెను, దానిని గ్రహించవలెను, మరియు దానిని తమ అనుదిన జీవితంలో సరైన విధంగా అన్వయించుటకు జ్ఞానులై యుండవలెనని పౌలు ఆశించాడు.

లేఖనములను శ్రద్ధాళువుతో అధ్యయనము చేయుట ద్వారా వారి నుండి దేవుడాశించుచున్నదేమిటో నేటి క్రైస్తవులు కనుగొనవచ్చును. అజ్ఞానుల వలె గాక, జ్ఞానుల వలె సమయమును పోనియ్యక దానిని సద్వినియోగము చేసికొనుట అనగా, ఎల్లప్పుడు దేవుని వాక్యమును తెలిసికొనుచు, దానిని గ్రహించుచు, అన్వయించుచు, తదనుగుణంగా జీవించుటయై యుండింది.

### "ఆత్మపూర్ణులై యుండుడి" (5:18–21)

**18మరియు మద్యముతో మత్తులైయుండకుడి, దానిలో దుర్వ్యాపారము కలదు; అయితే ఆత్మ పూర్ణులైయుండుడి. 19ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువునుగూర్చి పాడుచు కీర్తించుచు, 20మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట సమస్తమునుగూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, 21క్రీస్తునందలి భయముతో ఒకనికొకడు లోబడియుండుడి.**

అటుతరువాత పౌలు "**ఆత్మ** పూర్ణులై యుండుడి" అను ఒక ఆజ్ఞారూపక వాచకమును జారీచేసాడు. 5:19–21లో తద్వారా కలుగు కొన్ని ఫలితములను ఆయన మూడు సూత్రములను ఉపయోగించుట ద్వారా చూపించాడు. విశ్వాసములో పరిపూర్ణులగుచుండు క్రైస్తవులు పాటల ద్వారా దేవుని స్తుతించుచుందురు, సమస్త విషయములలో ఆయనకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుచుందురు. సహోదర చింత మరియు సహకారముతో ఒకరికొకరు లోబడియుందురు.

**వచనము 18.** అజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుటలో **ఆత్మతో నింపబడి యుండుట** నిహితమైయున్నది. పౌలు వ్యతిరేకార్థక పదజాలముతో ప్రారంభిస్తున్నాడు: **మద్యముతో మత్తులై యుండకుడి.** తాగుబోతుతనము అజ్ఞానుల జీవిత శైలికి చెందియున్నది, జ్ఞానుల జీవన విధానమునకు కాదు. అంధకారమునకు సంబంధించినవారు మద్యముతో మత్తులై యుండవచ్చును, కానీ వెలుగు సంబంధులు ప్రశాంతముగలవారై యుందురు (రోమీయులకు 13:12, 13; 1 థెస్సలొనీకయులకు 5:6–8 చూడుము). మద్యముతో మత్తెక్కియుండుట వలన అది **దుర్వ్యాపారమునకు** (*asōtia*) దారితీయునని పౌలు రూఢిగా చెప్పుచున్నాడు. ఈ గ్రీకు

పదము "రక్షించుట," "కాపాడి సంరక్షించుట," "భద్రపరచుట" అని అర్థమిచ్చు *sōizō*తో సంబంధముగలదైయున్నది;[6] కానీ వ్యతిరేకార్థకమైన పూర్వప్రత్యయము *alpha*తో సంబంధముగలదైయున్నది. *Asōtia* అను పదము "వ్యర్థమైన పరిస్థితి" లేక "అత్యంత నిర్లక్ష్యముతో కూడిన తత్కాలావేశము" అను అభిప్రాయమును సూచించుచున్నది. మద్యముతో మత్తెక్కియుండుటలో సద్గుణము లేదు కానీ "తత్కాలావేశము, అనుచితమైన లైంగిక లోలత్వము,"[7] అదుపుతప్పిన, వృథాయైన జీవితము మాత్రమే ఉన్నాయని పౌలు చెప్పుచుండెను. ఒకని మనస్సులోనున్న విషయాలలో ఏదైతే మొట్టమొదటి స్థానాన్ని ఆక్రమించుకొంటుందో వాడు దాని చేత అదుపు చేయబడుచుండును. వారు మద్యం సేవించడంపై తన మనస్సును కేంద్రీకరించినట్లయితే, వాడు రక్షింపబడుటకు ఒక ఆటంకముగల జీవితమును జీవిస్తున్నాడని అర్థం. ఇందుకు భిన్నంగా, "ఆత్మ పూర్ణుడై" యున్నవాడు దైవభక్తిగల జీవితం జీవిస్తున్నాడని అర్థం.

"పూర్ణుడై" ("నింపబడి") (*plēroō*) అనగా, "చేపలతో నిండిపోయిన వల (మత్తయి 13:48), పరిమళ వాసనతో నిండిపోయిన ఇల్లు (యోహాను 12:3); ఒక లోయ నిండిపోవుట (లూకా 3:3–6)"[8] వలె అందుబాటులోనున్న స్థలమంతటిని ఆక్రమించుటకొనుటయను అభిప్రాయాన్ని కలుగజేస్తుంది. జ్ఞానుల వలె లేదా అజ్ఞానుల వలె, జాగ్రత్తపరులుగా లేదా అజాగ్రత్తపరులుగా జీవించుటకు మధ్య గల తేడా, "ఆత్మతో నింపబడవలెనను" ఆశ కలిగియుండుటలో కనబడుతుంది.

"ఆత్మ పూర్ణులై" యుండుట "మద్యముతో మత్తులై" యుండుటతో పోల్చబడుచున్నది. ఒకని మనస్సు నిండియుండు ఆలోచనలు వాని చర్యలను అదుపుచేయును, అవి మంచివై యుండవచ్చును లేదా చెడ్డవై యుండవచ్చును. క్రైస్తవుడు "ఆత్మతో నింపబడవలెనని" కనిపెట్టుకొని యుండవలెను. ఈ విధంగా పరిశుద్ధాత్మ స్వభావమును మనస్సున పట్టించుట, ఒకడు బాప్తిస్మము తీసుకొను సమయంలో పొందిన "ఆత్మ వరము"నకు భిన్నమైనదైయున్నది (అపొస్తలుల కార్యములు 2:38). ఆత్మ వరము, విశ్వాసిలో నివసించుటకు విశ్వాసికి ప్రధానం చేయబడిన పరిశుద్ధాత్మ తానే అయియున్నాడు (అపొస్తలుల కార్యములు 5:32; 1 కొరింథీయులకు 6:19). ఈ వరము, పౌలు ఇంతకు మునుపు ఎఫెసీ పత్రికలో చెప్పిన విధంగా, ఆత్మ ద్వారా లభించు శక్తితో అంతరంగ పురుషుని బలపర్చుటకు ఉద్దేశింపబడింది (3:15–18). ఒకడు దేవుని అధీనములో నుండుటకు వానికి పరిశుద్ధాత్మ సహాయము చేయాలనియు, సహాయము చేయగలడనియు వానికి గల కోరిక మరియు నమ్మకము చేత, ఒక క్రైస్తవుని జీవితములోని పరిశుద్ధాత్మ శక్తి కార్యశీలము చేయబడును. మద్యముతో మత్తుడై యుండువాడు మద్యము అధీనమునకు తననుతాను వశంచేసుకొంటాడు, అయితే క్రైస్తవుడు తన మేధావిని, తన భావోద్రేకములను, మరియు తన కోరికలను దేవుని చిత్తమునకు అప్పగించుకొంటాడు. అప్పుడు వాడు దేవుని అధీనములో ఉండునట్లు పరిశుద్ధాత్మ వానికి సహాయము చేయును.

**వచనము 19.** ఒక క్రైస్తవుడు పరిశుద్ధాత్మ చేత నింపబడియున్నాడని చెప్పుటకు రుజువు అద్భుతకరమైన సూచన క్రియలు చేయుట కాదు, కానీ వాడు చేసికొను ఎంపికలైయున్నవి. మొదటిగా, "ఆత్మతో నింపబడినవారు" ఆరాధించువారైయుందురు. **పాటలు పాడుట** తప్పనిసరిగా పరిశుద్ధుల సమావేశమును సూచిస్తుంది, ఎందుచేతననగా పౌలు ఒక

గుంపును సూచించు **ఒకనికొకడు** అను పదమును ప్రయోగించుచున్నాడు. ఇది ఏకాంత ధ్యానము కాదు, కానీ ఇతరులతో కూడ కలిసి చేయవలసినదై యున్నది.

పాటలు పాడుటలో **కీర్తనలు** (*psalmos*), **సంగీతములు** (*humnos*), మరియు **ఆత్మసంబంధమైన పాటలు** (*ōidē*) కలిగియున్నవి. వీటి ఉద్దేశం, ఉపదేశించుట, బుద్ధిచెప్పుట, మరియు ఒకనినొకడు హెచ్చరించుకొనుటయై యున్నది. (కొలొస్సయులకు 3:16 చూడుము, అచ్చట పౌలు "ఒకనికి ఒకడు బోధించుచు, బుద్ధిచెప్పుచు" అని వ్రాస్తున్నాడు.) "సంభాషించుకొనుట" మరియు "బోధించుచు బుద్ధిచెప్పుకొనుట" "కీర్తనల"తో చేయబడవలెను. "కీర్తనలు" అని చెప్పినప్పుడు, పాటలుగా పాడుకొనవలెనని రచింపబడినవి, అనగా పాత నిబంధనలో గల కీర్తనల గ్రంథంలోని కీర్తనలనే పౌలు ఉపద్దేశించి యుండును. అనేక కీర్తనలకు సంగీతము సమకూర్చబడి ఈనాడు సంఘముల చేత ఉపయోగించుకొనబడుచున్నవి. "సంగీతములు," మతసంబంధమైన పద్యములై యున్నవి, వీటికి కూడా సంగీతం సమకూర్చబడింది, అవి దేవుని లేదా దేవుని గూర్చి ఉద్దేశించి సంబోధింపబడినవి. "ఆత్మసంబంధమైనవైయున్న" (*pneumatikos*) పాటల్లో లోక సంబంధమైనవి కాదు కానీ మత సంబంధమైన విషయాలు ప్రధానాంశములై యుండి, అవి ఉపదేశించును, ప్రోత్సాహించును, ఆప్యాయతను సమకూర్చును, లేదా విధేయతకు దారితీయును. "కీర్తనలు" మరియు "సంగీతములు" మరియు "ఆత్మసంబంధమైన పాటల" మధ్య గల కచ్చితమైన వ్యత్యాసమును చూపించుట కష్టము. వీటికి పౌలు తన జాబితాలో వేరు వేరుగా పేర్కొనగా, ఆయన సామాన్యంగా పర్యాయ పదాలను ప్రయోగించి యుండవచ్చును. ఈ మూడు పదములు మతపరమైన పాటల విషయంలో కీర్తనల గ్రంథంలోను LXX లోను అత్యంత సామాన్యముగా ఉపయోగింపబడుచు, ఆదానప్రధానాలుగా వాడబడిన మాటలై యున్నవి.[9] మొదటి శతాబ్దము నాటి యూదా మత చరిత్రకారుడు ఫ్లేవియస్ జొసెఫస్ తన రచనలలో "సంగీతముల"కు "కీర్తనల"తోను "పాటల"తోను సంబంధం కలిపాడు.[10] ఈ పదముల నిర్వచనములు విభిన్నమైనవై యుండగా, పౌలు ఆదేశము మేరకు, పాడవలసినదేమిటో, అది దేవునికిని మనము ఆయనను ఆరాధించుటకును సంబంధించినదై యున్నదని అన్నీ అంగీకరించుచున్నవి.

పాటలు పాడుటలో రెండు ఉద్దేశాలున్నాయి. ఒకటి, అవి ఉపదేశించవలెను, మందలించవలెను, మరియు తోటి మానవుల మధ్య నుండు సమతల సత్సంబంధమలతో కూడినవై *ఒకనితో నొకడు సంభాషించుకొనునవై* యుండవలెను. రెండవది, నిటారు సత్సంబంధములో, దేవునికి కృతాజ్ఞతాస్తోత్రములు తెలియజెప్పుచున్నవై యుండవలెను (కొలొస్సయులకు 3:16 చూడుము). పాటలు పాడుట, "బోధించుట" లేదా "ఉపదేశించుట"[11] మరియు "మందలించుట" కొరకు – అనగా, "హెచ్చరించుట, బుద్ధిచెప్పుట ... ప్రోత్సాహించుట, (లేదా) గద్దించుట కొరకు రూపొందింపబడింది."[12]

**వినసొంపుగా** అను అర్థమిచ్చు గ్రీకు పదము *psallontes*, *psallō* యొక్క ఒక రూపమై యున్నది. సరియైన సంబంధిత అర్థం గూర్చి గొప్ప వాదప్రతివాదము తలెత్తినది. పదిహేడు గ్రీకు–ఆంగ్ల శబ్ద కోశముల చేత ఇవ్వబడిన నిర్వచనములను ఉదాహరించి పేర్కొనిన మీదట, *psallō* అను పదము శతాబ్దాలుగా ఐదు వెవ్వేరు అవగాహనలతో వాడబడినదను ఒక తుది అభిప్రాయమును ఎమ్. సి. కర్ఫీస్ తెలిపాడు.

> (1) వెంట్రుకలను పెరకుట; (2) విల్లు తాడును బిగించుట; (3) వడ్రంగివాని నూలును మెలి తిప్పుట; (4) సంగీత వాయిద్యము తీగలను మీటుట, అనగా, వాయిద్యములతో సంగీత స్వరమును వినిపించుట; మరియు (5) మానవ హృదయములోని తంత్రులను తాకుట, అనగా, పాట పాడుట, స్తుతి సంగీతములతో ఉత్సవము చేసుకొనుట.[13]

వాటికి ఆరాధనతో సంబంధమే లెదంటూ కర్ఫీస్ *psallō* యొక్క మొదటి మూడు ఉపయోగములను కొట్టిపారేసాడు. ఆ తరువాత *క్రొత్త నిబంధనలో ఈ పదమునకు, పాటల ద్వారా దేవునికి స్తోత్రగానము చేయుటయను అర్థమున్నదని* శబ్దకోశముల సహాయముతో వివరించాడు.[14] సంఘ కాపరుల చేత (అపొస్తలుల తొలి సంవత్సరాల్లో జీవించిన సంఘ నాయకుల చేత) *psallō* ఉపయోగించుకొనబడిన విషయాన్ని, నిర్దిష్టమైన మరియు జాతివ్యాప్త ఆజ్ఞల దృష్ట్యా దాని ఉపయోగమును, క్రొత్త నిబంధనలో దాని ఉపయోగమును కర్ఫీస్ తాను పరీక్షించి తెలిసికొన్న వివరాన్ని తన పుస్తకంలో రచించాడు. మొదటి శతాబ్దము నాటి సంఘ సంగీతము కేవలము వాగ్విషయకమైనదై యుండిందని ఆయన చెప్పాడు.

పాటలు పాడవలెనను క్రొత్త నిబంధనలోని ఆజ్ఞకును పాత నిబంధనలో సంఘటనలకు, పరలోకంలో సంభవించనైయున్న సంఘటనలకు, లేదా ప్రజలకు ఏది ఎక్కువగా ప్రీతికరమైనదను విషయానికి ఎటువంటి సంబంధం లేదు. అదంతా కూడ వారు ఆయనను ఆరాధించునప్పుడు ఏమేమి చేయవలెనని, అనగా పాటలు పాడుట గూర్చియే, దేవుడు క్రొత్త నిబంధన క్రింద తన ప్రజలైయున్నవారికి సెలవిచ్చిన దానికి సంబంధించినదై యున్నది. ఒకడు జాగ్రత్తగాను వివేకంతోను జీవించినట్లయితే, వాడు సరిగ్గా దేవుడు చేయుమని సెలవిచ్చిన దానినే చేస్తాడు.

**మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుచు** అను మాటలు ఆరాధనలోని నిటారుగా దేవునితో గల సత్సంబంధమును, ఉద్ఘాటించుచున్నవి, ఏలయనగా ఆరాధన "ప్రభువునకు" చేయబడవలసిన విషయమై యున్నది. హెబ్రీయులకు 13:15లో, మనము క్రీస్తు ద్వారా "దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయవలెనని, అనగా, ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించవలెనని" గ్రంథకర్త చెప్పుచున్నాడు. ఆరాధన క్రీస్తు యొక్క సామూహిక శరీరమునకు మేలు చేకూర్చును, కానీ సమావేశమైన సమూహములోని ప్రతి ఒక్కరి ద్వారా దేవునికి ఆరాధన అర్పింపబడును. మీట నొక్కబడవలసిన సంగీత వాయిద్యము హృదయమైయున్నది. మందలింపు "పాటలు పాడుట"కు సంబంధించినదై యున్నది, సహజంగానే పాడుటలో నోరు చేరియుంటుంది; కానీ *psallō* కొరకు ఉపయోగింపబడు సంగీత వాయిద్యము హృదయమైయున్నది. మొదటి శతాబ్దము నాటి సంఘము దాని ఆరాధన సమయంలో యంత్రసంబంధనమైన సంగీత వాయిద్యములను ఉపయోగించిందని చెప్పుకొనుటకు లేఖనములలో లేక సంఘ చరిత్రలో ఎటువంటి నిదర్శనమైనను లేదు. సరికదా ఇందుకు పరస్పరం విరుద్ధంగా, సంఘారాధనలోని సంగీతము వాగ్విషయకమైనదై యుండినదని అందుబాటులోనున్న రుజువు సూచిస్తుంది.

"సంగీత వాయిద్యములను ఉపయోగించ *వద్దని* బైబిలు సెలవిచ్చుట లేదని" చెప్పుకొనుచు, మనము ఆరాధనల్లో సంగీత వాయిద్యముల స్వరములను ఉపయోగించవచ్చునని తర్కించుట, సంపూర్తిగా అసమర్థనీయమైనదై యున్నది. మనము

ఏంచేయాలో దేవుడు సెలవిచ్చుచున్నప్పుడు, ఆయన సాధ్యమగు ప్రతి ప్రత్యామ్నాయమును పేర్కొంటూ, “ఇలా చేయ వద్దు,” “అలా చేయకూడదు” అని చెప్పాల్సిన అవసరం లేదు. దేవుని వాక్యము ఇవన్నీ అనగా, ఆయన సెలవిచ్చు ఆజ్ఞలు మరియు ఈ ఆజ్ఞలు అమలు చేయుటకు అవసరమైయున్నవన్నీ *కలిసియున్నదై* యున్నది, ఇంతేగాక అది ఆయన ఆజ్ఞాపించిన దానికి భిన్నమైన దేనినైనను మినహాయిస్తూ, *మినహాయింపైనదై* యున్నది. ఆయను ఆరాధించువారు వారి హృదయాల్లో “ప్రభువును గూర్చి” పాటలు పాడుచు ఆయనను కీర్తించుచుండవలెను. క్రీస్తు మరియు దేవుని సంపూర్ణత నివసించు చోట, ఆత్మతో నింపబడినవారి ఆనందభరితమైన హృదయాలు ప్రభువును గూర్చి స్తోత్రగానములతో పొంగి పొర్లుచుండును.

**వచనము 20.** కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట “ఆత్మతో నింపబడి యున్నారని” చెప్పుటకు గల రెండవ రుజువైయున్నది. కృజతజ్ఞతాస్తుతులు ఏవో కొన్ని విషయాల్లోనే, ఏదో కొంత కాలము వరకే కాదు, కానీ **సమస్తమును గూర్చి కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెనని**, అది కూడ **ఎల్లప్పుడు** చెల్లింపవలెనని పౌలు చెప్పాడు. 1 థెస్సలొనీకయులకు 5:16–18లో, “ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడని” ఆయన రచించాడు. క్రైస్తవుడు సమస్త మంచి ఈవులను కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచుండును. అతడు చెడు జరిగినప్పుడు సహితము, “దేవుని ప్రేమించువారికి … సమస్తము సమకూడి జరుగునట్లు ఆయన చేయునని” ఎరిగినవాడై, కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచుండును (రోమీయులకు 8:28).

మనము క్రీస్తు యేసు ద్వారా దేవుని సమీపిస్తామనియు (యోహాను 14:13; 1 తిమోతి 2:5; హెబ్రీయులకు 13:15 చూడుము). “ఒక్క ఆత్మయందు తండ్రి సన్నిధికి చేరగలుగుచున్నామనియు” (2:18) ఎరిగినవారై, ఎఫెసీయులు **మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట** కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలసినవారైయుండిరి. మనము కృతజ్ఞతాస్తుతులు నేరుగా **దేవునికి, తండ్రియైన దేవునికే,** “శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబంధమైనదై, జ్యోతిర్మయుడగు తండ్రి యొద్ద నుండి వచ్చును” అని యాకోబు చెప్పినప్పుడు అతడు ఎవరి *గూర్చియైతే* చెప్పాడో ఆయనకే చెల్లించుచుందుము (యాకోబు 1:17).

**వచనము 21.** వారు **ఒకనికొకడు లోబడి యుండుట,** క్రైస్తవులు “ఆత్మతో నింపబడి యున్నారని” చెప్పుకొనుటకు గల మూడవ రుజువై యున్నది. ఈ మందలింపు పౌలు వ్రాసిన పత్రికలోని ఒక విభాగము ముగింపునకు గురుతై యున్నది, కానీ అది మరొక విభాగము మొదలౌతున్నదని కూడ తెలుపుచున్నది. కుటుంబములు మరియు దాసత్వమునకు సంబంధించిన మరొక సుదీర్ఘమైన విభాగమును తన పత్రికలో ప్రవేశపెట్టుటకు అపొస్తలుడు ఒకనికొకడు లోబడియుండుట గూర్చిన అభిప్రాయాన్ని ప్రయోగించాడు. ఎఫెస్సు పట్టంలోని క్రైస్తవులు ఐకమత్యముతో జీవించవలెనని పౌలు ఆశించాడు. వారు ఐకమత్యముతో ఉండవలెనంటే, వారు తమ్మునుతాము దేవునికి అప్పగించుకొని, ఒకని నొకడు ప్రేమతో సహించుచు, దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయమును ప్రదర్శింపవలెను (4:1–3). ఇంతేగాక, సంఘములోని సామరస్యమునకు ఆటంకము కలిగించునవి పెడదోవపట్టు నోటి మాటలు మరియు క్రియలకు విరోధముగా తమ్మునుతాము కాపాడుకొనుట ద్వారా వారు పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడదు (4:25–32). వారు ఒకనికొకడు లోబడియుండుట

సామరస్యపూర్వకమైన సహజీవనమునకు ఒక రహస్యమై యున్నదని వారు కనుగొందురు.

"లోబడుట" (*hupotassō*), "క్రింద" (*hupo*) మరియు "ఒక నియమమునకు" (*tassō*) అను పదములను జోడించుచున్నది.[15] *Tassō* సైనిక దళములను లేదా నావలను ఒక సైనికాధికారి క్రింద ఉచిత క్రమంలో ఉంచదలచినప్పుడు సైనికపరమైన సందర్భములో ప్రామాణికమైన గ్రీకు భాషలో ఈ పదము ప్రయోగింపబడింది; ఇందులో ఒకనికొకడు లోబడియుండుట ఇమిడియుండింది. ఈ వచనములోని క్రియా పదము, "ఒకడు తనను తాను వశముచేసుకొనుట, లోబడుట" అను అర్థమిచ్చుచున్నది.[16] పౌలు రచనలలో మరొక చోట, లోబడి యుండుట గూర్చిన భావన "*నిర్దిష్టమైన గుంపుల* – స్త్రీల (1 కొరింథీయులకు 14:34; కొలొస్సయులకు 3:18; 1 తిమోతి 2:11; తీతు 2:5), పిల్లల (1 తిమోతి 3:4), మరియు దాసుల (తీతు 2:9) వైఖరి నిమిత్తమే – లేదా *విశ్వాసులు తమ దేశము యెడల కలిగియుండు వైఖరి విషయంలో* (రోమీయులకు 13:1, 5; తీతు 3:1)" వాడబడింది.[17] (ఉద్ఘాటనను గమనించండి).

**క్రీస్తునందలి భయముతో** అను మాటలు క్రీస్తును గౌరవిస్తూ ఆయనకు మర్యాద ఇచ్చువారు ఇతరుల యెడల కూడా ఇదే వైఖరి కలిగియుందురని సూచించుచున్నవి. "క్రీస్తు యెడల గల పూజనీయ భావముతో ఒకనికొకడు లోబడియుండుడని" NIV చెప్పుచుండగా, KJV "దేవునియందలి భయము" గూర్చి చెప్పుచున్నది. వినయముతో కూడిన ఒక వైఖరిని ప్రదర్శిస్తూ ఇతరుల అవసరములను మన అవసరముల కంటె ఎక్కువ ముఖ్యమైనవాటిగా పరిగణించుట క్రీస్తు మాదిరిని అనుకరించుటయైయున్నది (ఫిలిప్పీయులకు 2:3–8 చూడుము).

5:21లో పౌలు ఒక సాధారణ నియమమును ఇచ్చిన తరువాత, 5:22–6:9లో దీనిని ఆయన నిర్దిష్టముగా భర్తలకు మరియు భార్యలకు, తల్లిదండ్రులు మరియు పిల్లలకు, యజమానులు మరియు దాసులకు అన్వయించాడు.

## భార్యాభర్తలుగా గౌరవించుకొను సంబంధములు (5:22–33)

కొలొస్సయులకు 3వ అధ్యాయంలో చెప్పినట్లే, ఎఫెసీయులకు 5వ అధ్యాయంలో, పౌలు సంఘము పరిధిలో భార్యాభర్తల మధ్య ఉండాల్సిన సంబంధముల గూర్చి మాటలాడుచున్నాడు. ఈ ఆదేశము గూర్చి భార్యలతో మాటలాడుటకు మొదలుపెట్టి భార్యలతోనే ముగించాడు, కానీ ఆయన చెప్పిన దానిలో ఎక్కువ భాగం భర్తలనుద్దేశించినదై యున్నది. ఈ వక్కాణింపు 1 పేతురు 3:1–7లో తిరిగి రాయబడింది.

### భార్యలు: "లోబడి యుండుడి" (5:22–24)

**22స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంతపురుషులకు లోబడియుండుడి. 23క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు. 24సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలుకూడ ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడవలెను.**

**వచనము 22.** వారు (తమ) **భర్తలకు లోబడియుండవలెనని భార్యలకు** ఆదేశములియ్యబడినవి. ఒకే క్రియా పదము (*hupotassō* నుండి) క్రైస్తవులు ఒకరికొకరు లోబడి యుండవలెనని చెప్పబడిన సందర్భంలో 21వ వచనంలోను పంచుకొనబడుచున్నది, మరియు 22వ వచనంలోను, భార్యలు తమ భర్తలకు లోబడియుండవలెనని చెప్పబడినయున్నది. 22వ వచనంలోని "లోబడియుండుడి" అనే క్రియా పదము మూల గ్రంథ పాఠములో లేకుండినది, కానీ చెప్పుకొనబడుచున్న అభిప్రాయము అంతర్నిహితమై యున్నదను ఆలోచనతో అనువాదకుల చేత చేర్చబడినదని సూచించుటకు "లోబడియుండుడి" అను మాటలు అనేక (ఆంగ్ల) బైబిల్లలో *ఏటవాలుగా నుండు అక్షరములలో* వ్రాయబడి యుండును. అక్షరార్థముగా చూచినట్లయితే, పౌలు "ఒకరికొకరు లోబడియుండుడి ... భార్యలు మీ భర్తలకు లోబడి యుండవలెనని" చెప్పుచుండెను. అటుతరువాత, 24వ వచనంలో, భార్యలు తమ భర్తలకు లోబడి యుండవలెనని పౌలు సుస్పష్టంగా చెప్పాడు.

భార్యలకియ్యబడిన ఈ ఆజ్ఞ వారు తమ భర్తలకు విధేయతతో లోబడుచు (1 పేతురు 3:1, 6 చూడుము), వారికి మర్యాద చూపించుట (ఎఫెసీయులకు 5:33) గూర్చినదై యున్నది. సంఘము క్రీస్తునకు లోబడుచుండుట (5:24), భార్య తన భర్తకు లోబడుటను సూచించు మాదిరియై యున్నది. తొలి శతాబ్దము నాటి ఎఫెసీయుల సంస్కృతి పౌలు బోధలను అర్థంచేసుకొనిన విధానమునుబట్టి, అతని తుది అభిప్రాయము బలపర్చబడి యుండును. సర్వసాధారణ అవగాహన చొప్పున, భార్యాభర్తలు ఒకరికొకరు లోబడి యుండవలెను; కానీ నిర్దిష్టమైన అవగాహన చొప్పున, భార్యలు తమ భర్తలకు "లోబడి యుండవలెను."

**ప్రభువునకు వలె** అను మాటలు, వారు యేసునకు లోబడిన "అదే విధముగానే"[18] (*hōs*) భార్యలు తమ భర్తలకు లోబడవలెనని సూచించుచున్నవి. తమ భర్తలకు లోబడుట ద్వారా, భార్యలు క్రీస్తుకు లోబడుచున్నారు. కొలొస్సయులకు 3:18లో ఇదే అభిప్రాయము నివేదింపబడియున్నది, అచ్చట పౌలు, "భార్యలారా, మీ భర్తలకు విధేయులై యుండుడి, ఇది ప్రభువునుబట్టి యుక్తమైనది" అని రచించాడు.

భార్యలు తమ భర్తలకు లోబడి యుండుటకును, యోగ్యతకును (భర్తలు కంటె ఎక్కువ విలువైనవారు కారు) లేక దేవుని దృష్టికిని (దేవుని దృష్టిలో స్త్రీపురుషులు సమాన విలువ కలిగియున్నారు; గలతీ 3:28) ఎటువంటి సంబంధం లేదు. విశేషంగా, లోబడుట అనునదంతా వారు నిర్వర్తించవలెనని దేవుడు భార్యాభర్తలకు నియమించిన వెవ్వేరు పాత్రలతో సంబంధంగలదై యున్నది. భార్యాలు క్రీస్తునకును తమ భర్తలకును లోబడి యుండవలెను.

**వచనము 23.** తరువాత, భార్యలు తమ భర్తలకు లోబడియుండుటకు గల హేతువును పౌలు వివరించుచున్నాడు. "ఏలయనగా" అనునది సముచ్ఛయ పదము hoti యొక్క ఒక అనువాదమై, "ఎందుకనగా"[19] అని అర్థమిచ్చు ఆంగ్ల పదమునకు ("because") అనురూపంలో ఉన్నది. **క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు** అని పౌలు రచించాడు. భార్యకును భర్తకును మధ్య, మరియు క్రీస్తునకును సంఘమునకును మధ్య గల సామర్థ్యమును పౌలు చూపించుచుండెను. సంఘము క్రీస్తు యొక్క పెండ్లి కుమార్తెయై యున్నది. భర్త కుటుంబములో వహించు పాత్ర క్రీస్తు

సంఘములో వహించు పాత్ర వంటిదై యున్నది. ఈ పాత్ర “శిరస్సు”గా వర్ణింపబడింది. అది *kephalē* యొక్క అనువాదమై, “నాయకుడు లేక పరిపాలకుడు” అని అర్థమిచ్చుచున్నది.[20] అంతకు మునుపు, క్రీస్తు సంఘమునకు, “అది ఆయన శరీరమై యున్నది,” శిరస్సైయున్న విషయాన్ని వర్ణించుటకు పౌలు ఈ పదమును ప్రయోగించాడు (1:23). నిస్సందేహంగా, ఒక నాయకుడుగా మరియు ఒక పరిపాలకుడుగా క్రీస్తు కలిగియుండిన అధికారము పౌలు మనస్సులో ఉండింది (మత్తయి 28:18 చూడుము). అదే విధంగా, భర్తలు నాయకత్వం వహించుటకు మరియు ఏలుబడి చేయుటకు అధికారము కలిగియున్నారు. కుటుంబములో గల దేవుని నమూనా, ఆయన సంఘములో కలిగియున్న నమూనాను అనుసరించుచున్నదై యున్నది. ఆయనకు అధాకారమున్నదను విషయాన్ని ఆయన అదుపులో ఉన్నంతగా దృష్టింపబడకూడదు, కానీ ఒక నాయకుడై యున్నాడని ఎంచబడవలెను. తరువాతి వచనములలో పౌలు భర్తలకు ఇచ్చిన ఆదేశములలో ఈ వాస్తవము కనబడుచున్నది.

**ఆయన** [NASB] **శరీరమునకు రక్షకుడైయున్నాడు** అను మాటలు, సహజంగానే, క్రీస్తును సూచించుచున్నవి. భర్తలు తమ భార్యలను క్రీస్తు నొద్దకు నడిపించువారను గ్రహింపులో తప్పితే, వారు వారి రక్షకులైయున్నారని పౌలు చెప్పుచుండుట లేదు. ఈ మాటలను క్రీస్తుకు, సంఘమునకు శిరస్సైయున్నవానికి, ఒక అదనపు వర్ణనగా ఆయన చేర్చాడు.

ఎఫెసీయులు ఒకప్పుడు రక్షింపబడని స్థితిలో జీవించుచుండిరి (2:1–3). పాపపు స్థితిలో వారు దేవుని నుండి వేరుచేయబడినవారై యుండిరి. వారిని రక్షించుటకు క్రీస్తు చేసిన సమాధానపరచు కార్యము ద్వారా దేవుడు కృపాసహితముగా వారి పట్ల ప్రవర్తించాడు (2:4–22). క్రీస్తునందు వారు దేవునితో “ఏక శరీరముగా” (2:16), సంఘముతో (1:22, 23) సమాధానపరచబడిరి. కాబట్టి, వారు సమాధానపరచబడిన మరియు రక్షింపబడిన క్రీస్తు శరీరమయ్యారు. క్రీస్తు “శరీరమునకు రక్షకుడై యున్నాడు” అని పౌలు చెప్పినప్పుడు దానిలోని భావము ఇదే. “అయియున్నాడు” అని అనువదింపబడిన క్రియా పదము estin, వర్తమాన కాలంలో సంభవించుచున్న సంగతిని సూచించుచున్నది. నిత్యత్వంలో సంఘము క్రీస్తు చేత రక్షింపబడినదై యుండుట మాత్రమే కాదు, కానీ ఇప్పుడు రక్షింపబడినవారు కలదైయుండునను వాస్తవము నిజమని ఇది నిరూపించుచున్నది.

**వచనము 24.** పౌలు మరొక పర్యాయము తన సాదృశ్యము వైపు మళ్లుచున్నాడు. ఒక వ్యాఖ్యానకర్త ఇలా రాస్తున్నాడు,

> సంఘము క్రీస్తుకు లోబడియుండవలెనని రచించినప్పుడు, రచయిత భావము ఏమైయుండెనో అని ఒకడు అడిగినట్లయితే, సంఘమునకును క్రీస్తునకును గల సంబంధమును మిగిలిన పత్రిక భాగములో రచయిత చిత్రీకరించిన విధానములో వాడు సమాధానము కొరకు చూడవచ్చును. సంఘము యొక్క సమస్తముపైన శిరస్సైయున్నవాని వలె క్రీస్తును దేవుని వరముగా సంఘము పొందుచున్నది (1:22). 2:20, 21లో గల కట్టడమునకు సంబంధించిన అలంకారిక దృష్టాంతములో క్రీస్తు దాని నిర్మాణములో మూలకు తలరాయియై యున్నాడనియు, సమస్తము చక్కగా అమర్చబడి యుండునట్లు చూచుచున్నాడనియు, సంఘము ఎంచుచున్నది. అది ఆయన యొక్క నిరంతరాయమైన సన్నిధిని బాహాటముగా ఆహ్వానించుచు (3:17) సమస్తమును సమగ్రముగా ఆలింగనముచేయు ఆయన ప్రేమను

తెలిసికొనుచున్నది (3:19). సంఘము దాని కృపావరమును (4:7), మరియు తన సొంత క్షేమాభివృద్ధి నిమిత్తము పరిచారకులనబడు వరమును (4:11, 12) పొందుచున్నది. అది దాని శిరస్సు వైపుగా అభివృద్ధి చెందుచు, ఆయనను గూర్చిన ఉపదేశముతో సహా (4:20, 21), ఇటువంటి ఎదుగుదలకు అవసరమైన దానంతటిని (4:15, 16) ఆయన నుండి పొందుచున్నది. సంఘము క్రీస్తు ప్రేమను అనుకరించుచున్నది (5:2) మరియు ఆయనకు ప్రీతికరమైనదేమిటో తెలిసికొనుచు (5:10) ఆయన చిత్తమను గ్రహించుటకు (5:17) ప్రయత్నించుచున్నది. సంఘము ఆయనకు స్తోత్రగానములు చేయుచు (5:19) ఆయనయందలి భయముతో జీవించుచున్నది (5:21). అలాగైతే, సంఘము లోబడి యుంటుందంటే, మేలైన ఆయన ఏలుబడి కొరకు, ఆయన నియమముల ననుసరించుచు జీవించుటకు, ఆయన సన్నిధిని మరియు ప్రేమను అనుభవించుటకు, పరిపక్వతకు దారితీయు ఎదుగుదలకు ఉపకరించు వరములను ఆయన నుండి పొందుటకు, తన ప్రియుని సంబంధములో అభివృద్ధిచెందునట్లు ప్రోత్సాహింపబడినందుకు కృతజ్ఞతతో ఆయనకు ప్రతిస్పందించుటకు, దాని శిరస్సు వైపు చూచుట యని అర్థము.[21]

**సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలు కూడ ప్రతి విషయములోను తమ భర్తలకు లోబడవలెనని** పౌలు ఘోషించాడు. తమ భార్యలు తమ భర్తలకు లోబడుట విషయంలో పౌలు ఎటువంటి మినహాయింపులనైనను సూచింపలేదు, అదే సమయంలో ఎటువంటి పరిమితులనైనను పెట్టలేదు. దానికి బదులుగా, తమ ప్రవర్తన క్రీస్తు మాదిరిని పోలియుండునట్లు చూచుకొనుచు, క్రీస్తుకు ప్రీతికరమైనవి మరియు వారికి మేలును చేకూర్చు ఆ యా విషయాలను మాత్రమే భర్తలు తమ భార్యల నుండి ఆశించుదురని ఆయన అనుకొన్నాడు. మానవ అసంపూర్ణతల మూలమున విచ్ఛిన్నమగుచుండిన సంబంధములనుబట్టి, ఆదర్శప్రాయమైన ఈ ఆలోచన ఎన్నటికిని నెరవేరకపోవచ్చును. ఏది ఏమైనా, భార్యాభర్తలు ఒకరి యెడల ఒకరు ప్రేమ కలిగి నిస్వార్థముతో ప్రతిస్పందించవలెనునది లక్ష్యమై యుండింది. తదుపరి వచనములు ఈ అభిప్రాయమును బలపర్చుచున్నవి.

### భర్తలు: "ప్రేమించుడి" (5:25-33)

**25-27పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తుకూడ
సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను
లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోష మైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన
తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దానిని
పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను. 28అటువలెనే
పురుషులుకూడ తమ సొంతశరీరములనువలె తమ భార్యలను ప్రేమింప బద్ధులైయున్నారు.
తన భార్యను ప్రేమించు వాడు తన్ను ప్రేమించుకొనుచున్నాడు. 29-30తన శరీరమును
ద్వేషించినవాడెవడును లేడు గాని ప్రతివాడును దానిని పోషించి సంరక్షించుకొనును. మనము
క్రీస్తు శరీరమునకు అవయవములమై యున్నాము గనుక ఆలాగే క్రీస్తుకూడ సంఘమును
పోషించి సంరక్షించుచున్నాడు. 31ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి
తన భార్యను హత్తుకొనును; వారిద్దరును ఏకశరీరమగుదురు. 32ఈ మర్మము గొప్పది;**

**అయితే నేను క్రీస్తునుగూర్చియు సంఘమునుగూర్చియు చెప్పుచున్నాను. [33]మెట్టుకు మీలో ప్రతిపురుషుడును తననువలె తన భార్యను ప్రేమింప వలెను, భార్యయైతే తన భర్తయందు భయము కలిగి యుండునట్లు చూచుకొనవలెను.**

**వచనము 25.** భార్యల మీది నుంచి తన దృష్టిని భర్తల వైపుగా మళ్లించుకొంటూ, పౌలు **పురుషులారా, మీరు భార్యలను ప్రేమించుడి** అని వ్రాస్తున్నాడు. భార్యలు తమ భర్తలకు లోబడవలెనను ఆజ్ఞ 25 నుండి 32 వరకు గల వచనాల్లో, భర్తలకు తమ భార్యల యెడల గల బాధ్యతలతో సంతులితము గావింపబడుచున్నది. ఈ విభాగము రెండు భాగాల్లో ఉన్నది. వారు తమ భార్యలను ప్రేమింపవలెనని భర్తలను మొదటి భాగము మందలించుచున్నది. క్రీస్తు సంఘము యెడల కలిగియున్న ప్రేమను చిత్రీకరించుచు భర్తలు తమ భర్యలను ఎలా ప్రేమించాలో పౌలు చూపించాడు (5:25–27). రెండవ భాగము భర్తలు తమ భార్యల యెడల కలిగియుండాల్సిన ప్రేమతో పొడిగింపబడింది. ఇచ్చట, క్రీస్తు సంఘము గూర్చి ఎలాగైతే శ్రద్ధ వహిస్తున్నాడో, అలాగే భర్తలు తమ్మునుతాము చూచుకొన్నట్లే, వారు తమ భార్యల యెడల ప్రవర్తించాలని పౌలు సూచించాడు (5:28–32).

ప్రేమ గూర్చిన భావన ఈ పత్రికలో ఒక క్రొత్త విషయమేమీ కాదు. పౌలు అంతకు మునుపు దేవుని ప్రేమ (2:4) మరియు క్రీస్తు ప్రేమ (3:19; 5:22) గూర్చి పేర్కొన్నాడు. అటుతరువాత, ఆయన ఎఫెసీయుల ప్రేమ, అంతమాత్రమేగాక దేవుని మరియు క్రీస్తు ప్రేమ గూర్చి మరొక పర్యాయము మాటలాడాడు (6:23, 24). ప్రస్తుతము మనము అధ్యయనము చేయుచున్న వాక్యభాగములో, క్రీస్తు సంఘమును ప్రేమించుచున్న సందర్భంలో భర్తలు తమ భార్యల యెడల కలిగియుండాల్సిన ప్రేమ గూర్చి పౌలు చెప్పుచుండెను.

"పురుషులారా, మీ భార్యలను ప్రేమించుడి" అను ఆజ్ఞాపూర్వక ఆదేశము కేవలము ఒక శృంగారపూరితమైన ప్రేమగా లేదా భావోద్రేకములతో కూడిన అపార్థం చేసికొనబడవచ్చును. ఏది ఏమైనా, ఒక విధమైన *agapaō* ("ప్రేమ, సౌహార్ద ఆదరము") యొక్క రూపమును ఈ విభాగమందంతటను ప్రయోగించుట ద్వారా తన మనస్సులో ఎటువంటి ప్రేమ ఉండిందో పౌలు తేటతెల్లము చేసాడు (5:1, 2 చూడుము). భర్తలు తమ భార్యల యెడల కలిగియుండాల్సిన ప్రేమ ఇరువురి విషయంలోను ఉత్తమమైనవై యుండు విషయాలనే వెదకవలెనని తీసికొనబడిన ఒక తీర్మానము యొక్క ఫలితమై యున్నది. అది సహాయము చేయుటకే గాని హాని చేయుటకు కాదు, కట్టుటకే గాని కూలగొట్టుటకు కాదు, ప్రోత్సాహించుటకే గాని నిరుత్సాహపర్చుటకు కాదని తీసికొనిన తీర్మానమై యున్నది.

భర్తలు తమ భార్యల యెడల కలిగియుండు ప్రేమ క్రీస్తు సంఘము యెడల కలిగియున్న ప్రేమను అనుకరించునదై యున్నది: **అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి, ... దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను.** భర్త ప్రేమ ఒక తీర్మానమై యుండుట మాత్రమే కాదు, కానీ ఆత్మ సౌఖ్యము త్యాగము చేయునదై యుండవలెను. లోక పాపము నిమిత్తము క్రీస్తు సిలువపై తనను తాను అప్పగించుకొన్నప్పుడు, ఆయన తన స్వరక్తముతో సంఘమును కొన్నాడు (అపొస్తలుల కార్యములు 20:28 చూడుము). ఆయన యొక్క త్యాగపూరితమైన మరణము లోకము ఎన్నడైనను ఎరిగిన లోబడుట గూర్చిన అతి గొప్ప చర్యయై యుండింది. సంఘము నెలకొల్పబడి దాని ఉనికిని అది కలిగియుండి,

దాని ఎదుగుదలను పోషించుచు, చివరకు దానిని పరలోకమునకు తీసికొనివచ్చుటకు, యేసు "దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను." ఈ సాదృశ్యము సంఘమును క్రీస్తు యొక్క పెండ్లి కుమార్తెగా చిత్రించుచున్నది, గనుక తన పెండ్లి కుమార్తె యొక్క సంక్షేమము నిమిత్తము క్రీస్తు త్యాగము చేయడనునది ఏమియు లేదు విధంగా, భర్తలు తమ భార్యల కొరకు తమ్మునుతాము అప్పగించుకొనవలెను. భార్యాభర్తల మధ్య నుండు పరస్పర అన్యోన్య అనురాగము, వారి సంబంధము దేవుడు వారి కుటుంబము కొరకు వేసియున్న ప్రణాళికతో సామరస్యముగలదై యుండునట్లు తోడ్పడును. వివాహం గూర్చి పౌలు కలిగియున్న దర్శనము ప్రకారము, భార్యలు తమ భర్తల నుండి పొందు "సంపూర్ణ ప్రేమకు సంపూర్ణంగా లోబడి యుందురు."[22] కెన్నెత్ ఎస్. వ్యుఎస్ట్ 25వ వచనమునకు ఒక ప్రాముఖ్యమైన వివరమును కలుపుచున్నాడు:

> భర్త తన భార్య యెడల ఇతరమైన మూడు విధాల ప్రేమ కలిగియున్నాడు, ప్రగాఢ భావావేశంతో కూడిన ప్రేమ (*eros*), ప్రసన్న చిత్తము మరియు తృప్తితో కూడిన ప్రేమ (*stergo*), మరియు అనురాగముతో కూడిన ప్రేమ (*phileo*). ఈ మూడు కూడా ఆత్మపూర్ణుడైన భర్త కలిగియుండు agapao ప్రేమతో సంతృప్తము గావింపబడినవై, పవిత్రము చేయబడి వాటి స్వభావములో పరలోక సంబంధమైన లక్షణముగలవై యున్నవి.[23]

**వచనము 26.** 26 మరియు 27 వచనములలో (25–27), సంఘము కొరకు క్రీస్తు తనను తమ త్యాగపూరితమైన ప్రేమతో అప్పగించుకొనినందుకు గల మూడు హేతువులను పౌలు అటుతరువాత వివరించాడు. తెలియజెప్పబడిన ప్రతి కారణము "నట్లు" అని అర్థమిచ్చు *hina*తో మొదలౌతుంది.

మొదటిది, సంఘమును **వాక్యముతో ఉదకస్నానము చేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచునట్లు** క్రీస్తు తనను తాను దాని కొరకు అప్పగించుకొనెను "పవిత్రపరచి" *hagios* ["పరిశుద్ధ"] యొక్క ఒక వాక్రూపమైనది) అనగా, "ఒక పవిత్రమైన పని కొరకు ప్రత్యేకపరచుట" అని అర్థము[24] ఈ పదము మరొక గ్రీకు పదము *koinos* నకు తారతమ్యములో వాడబడింది, అది ఈ సందర్భములో వాడబడలేదు కానీ "కళంకమైన, సామాన్యమైన, అపవిత్రమైన" అని అర్థమిచ్చుచున్నది.[25] ఒకడు పవిత్రపరచబడునట్లు, వాడు అపవిత్రమైన దాని నుంచి – అనగా, లోకము నుంచి – ఉపసంహరించుకొనవలెను లేక వేరుపరచుకొని దేవుని పరిశుద్ధ ఉద్దేశము కొరకు ప్రత్యేకించుకొనవలెను. సంఘములో క్రీస్తు రక్తము చేత పవిత్రము చేయబడిన ఆత్మలుగలవారున్నారు (1 పేతురు 1:22) మరియు వారు "చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలిచిన … దేవుని సొత్తైన ప్రజలునై యున్నారు" (1 పేతురు 2:9). సంఘము లోకములో నుండి పిలువబడి దేవుని పరిశుద్ధ ఉద్దేశము కొరకు ప్రత్యేకపరచబడింది. దేవుని ప్రజల పరిశుద్ధత ఈ పత్రికలో తరచుగా నొక్కివక్కాణింపబడుచున్నది. క్రైస్తవులను పౌలు "పరిశుద్ధులు" అని సంబోధించుచున్నాడు (1:1, 4–6, 15, 17, 18; 2:19; 3:15–18; 4:11, 12; 5:3 చూడుము). "పరిశుద్ధులు" *hagios* యొక్క అనువాదమై యున్నది. (ఇదే పుస్తకములోని "అదనపు అధ్యయనము కొరకు: సంఘము పవిత్రము చేయబడుట [5:26]" చూడుము.)

"వాక్యముతో" *en rhēmati* యొక్క అనువాదమై యున్నది, "వాక్యములో" దాని అక్షరార్థమై యున్నది. (ఆంగ్లమలోని "ది" అను మాటను అనువాదకులు చేర్చారు.) సంఘము నిర్మలము గావింపబడుట "వాక్యముతో" నీటి బాప్తిస్మము ద్వారా సార్థకమయ్యింది. "వాక్యము" ప్రకటింపబడిన సువార్త మాటలను మరియు వినిన వాక్యమునకు ఫలితంగా వారు పవిత్రము చేయబడుటకు బాప్తిస్మము పొందునట్లు ప్రజలను నడిపించిన దానిని సూచింపవచ్చును. బాప్తిస్మమియ్యబడు సమయంలో పలుకబడిన పలుకులను ఇది జప్తికి తెచ్చుచున్నది, ఉదాహరణ "క్రీస్తు నందలి అధికారముతో పాప క్షమాపణ కొరకును పరిశుద్ధాత్మ వరము కొరకును తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములో నేను నీకు బాప్తిస్మమిచ్చుచున్నాను" (మత్తయి 28:18, 19; అపొస్తలుల కార్యములు 2:38 చూడుము). బహుశా ఇందులో బాప్తిస్మముతో సంబంధముగల రక్షణ వాగ్దానము కూడ కలిసియుండును (మార్కు 16:16). 6:17లోని "వాక్యము," ప్రకటింపబడవలసిన "దేవుని వాక్యము" మరియు "ఆత్మ ఖడ్గము" అయియున్నది (రోమీయులకు 10:8, 17; హెబ్రీయులకు 6:5; 1 పేతురు 1:25 చూడుము). ఆయన వాక్యము నిర్మలముచేయు మరియు పవిత్రపరచు శక్తిగలదై యున్నది (యోహాను 15:3; 17:17 చూడుము), గనుక క్రీస్తు సంఘమునకు వాక్యముతో ఉదకస్నానము గావించినప్పుడు అది పవిత్రీకరింపబడింది. ఈ ప్రక్రియలో నీళ్లు మరియు దేవుని వాక్యము, ఈ రెండూ కలిసి వున్నాయి.

**వచనము 27.** *Hina* యొక్క రెండవ ఉపయోగము మరియు **అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైను లేక ... మహిమగల సంఘముగా ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనను** క్రీస్తు సంఘము కొరకు తనను తాను అప్పగించుకొనుటలో గల రెండవ ఉద్దేశము 27వ (25–27) వచనంలో కలదు. క్రీస్తు సంఘమును తన యెదుట పవిత్రమైన పెండ్లి కుమార్తెగా నిలువబెట్టుకుంటున్నాడు. 2 కొరింథీయులకు 11:2లో, అతడు కొరింథీ సంఘమును పవిత్రమైన పెండ్లి కుమార్తెగా క్రీస్తు యెదుట నిలువబెట్టి పెండ్లి కుమార్తె తండ్రియై లేక పెండ్లి కుమారుని స్నేహితుడైయున్నాడని పౌలు తనను గూర్చి తాను చెప్పుకున్నాడు. ఏది ఏమైనా, ఎఫెసీయులకు వ్రాయబడిన మూల గ్రంథ పాఠములో, క్రీస్తు సంఘమును తన యెదుట తానే "మహిమగల సంఘముగా" నిలువబెట్టుకొనున తెలియజెప్పబడుచున్నది. *endoxos* యొక్క అనువాదమైయున్న "మహిమ," సంఘము ఇదే పత్రికలో మరొక చోట ప్రస్తావింపబడిన సందర్భములో ప్రయోగింపబడిన ఒక పదమై, "వైభవము"ను గూర్చిన అభిప్రాయము గలదైయున్నది.[26] సంఘము మహిమాన్వితమైన స్వాస్థ్యములదై యున్నది (1:17, 18), గనుక సంఘము దేవునికి మహిమ కలుగజేస్తుంది (3:20, 21). 27వ వచనంలో, "మహిమ" సంఘము "నైతిక పరిపూర్ణత"యను వస్త్రములు ధరించి క్రీస్తు యొక్క పవిత్రమైన పెండ్లి కుమార్తెయై యున్నదను వర్ణనకు అదనంగా చేర్చబడింది.[27]

"కళంకము లేదా ముడత లేదా అట్టిది మరి ఏదైనను లేని" అను పదజాలము దీనికి ముందున్న పదజాలములో "మహిమ"తో వ్యత్యాసంగా పోల్చబడుచు, క్రీస్తు యొక్క పెండ్లి కుమార్తె నైతిక మచ్చ, కళంకము, లేదా అంగవైకల్యము లేనిదై యున్నదని ఉద్ఘాటించుచున్నది. ప్రాచీన కాలము నాటి వివాహ కార్యముల అభ్యాసముల ప్రకారము, పెండ్లి కుమారుడు పెండ్లి కుమార్తె ఇంటికి వచ్చి, వరకట్నము ఇచ్చి, పవిత్రురాలైయున్న

తన పెండ్లి కుమార్తెను వివాహమాడుటకు మరలా రావలెనను ఉద్దేశంతో తన ఇంటికి తిరిగి వెళ్లును. అదే విధంగా, క్రీస్తు వచ్చి, వరకట్నంగా "తనను తాను అప్పగించుకొని" (5:25–27), పరలోకమునకు తిరిగి వెళ్లాడు, గనుక పవిత్రమైన తన పెండ్లి కుమార్తె కొరకు మరలా రానైయున్నాడు. సంఘమును తన యెదుట నిలువబెట్టుకొనుట అంత్య కాలమున జరుగును. ఇది పౌలు 2 కొరింథీయులకు 11:2లో గ్రంథస్థం చేసిన దానితోను మరియు ప్రకటన 19లోని వివాహ విందుకు సంబంధించిన మనఃకల్పనతోను ఏకీభవించుచున్నది.

**కానీ సంఘము పరిశుద్ధమైనది మరియు నిర్దోషమైనదై యుండవలెను.** ఇది hina యొక్క మూడవ ప్రయోగము మరియు క్రీస్తు సంఘము కొరకు "తనను తాను అప్పగించుకొనుటకు" గల మూడవ కారణమై యున్నది. "పరిశుద్ధమును నిర్దోషమును" అను మాటలను, దేవుడు ఎఫెసీయులను "జగత్తు పునాది వేయబడక మునుపే" క్రీస్తునందు ఏర్పరచుకొనుటలో గల ఆయన ఉద్దేశమును చూపించుటకు పౌలు ఇంతకు మునుపు ఉపయోగించాడు (1:4–6). వారు "ఆయన యెదుట పరిశుద్ధులును నిందారహితులనై" యుండవలెనని పౌలు ఆశించాడు. అపరిశుద్ధత మరియు నిందసహితము దేవుని ఎరుగనివారి గుణగణములై యుండినవి, కానీ పరిశుద్ధత మరియు నిందారహితము సంఘము యొక్క సలక్షణములై యున్నవి. ఆయన "సంఘము కొరకు తననుతాను అప్పగించుకొనినప్పుడు" సిలువపై చిందింపబడిన క్రీస్తు రక్తము చేత పవిత్రము చేయబడుట సాధ్యమైంది గనుక సంఘము ఇప్పుడు "పరిశద్ధమును నిర్దోషమునై" యున్నది. వెలుగులో నడుచుకొనుచు యేసు రక్తము చేత పవిత్రము గావింపబడుట ద్వారా సంఘము "పరిశుద్ధమును నిర్దోషమునై" యుండుట కొనసాగుచున్నది (1 యోహాను 1:7). క్రీస్తు మరలా వచ్చినప్పుడు, ఆయన ఒక పవిత్రమైన పెండ్లి కుమార్తెను తన యెదుట నిలువబెట్టును. సంఘము రక్తము చేత పవిత్రము చేయబడింది గనుక, అది "పరిశుద్ధమును నిర్దోషమునై" యున్నదని పరిగణింపడవచ్చును. క్రీస్తు యొక్క సంఘములోని – ఆయన శరీరము మరియు ఆయన పెండ్లి కుమార్తె – సభ్యులముగా పౌలు ఈ పత్రికలో మనకిచ్చిన హెచ్చరికల ప్రకారము మనము జీవించవలసియున్నది.

**వచనము 28.** భర్తలు తమ భార్యల యెడల కలిగియుండిన బాధ్యతలను పౌలు పరిచయం చేస్తూ, వారు తమ భార్యల గూర్చి ఎలా శ్రద్ధ వహించాలో చూపించుటకు, క్రీస్తు సంఘము యెడల కలిగియున్న ప్రేమను ఆయన ఉదాహరణంగా ప్రయోగించాడు. **అటువలెనే పురుషులు కూడ తమ సొంత శరీరములనువలె తమ భార్యలను ప్రేమింప బద్ధులై యున్నారని** పౌలు సెలవిచ్చాడు. "అటువలెనే" అను మాట *houtōs* యొక్క అనువాదమై, తరువాతి విషయము భర్తలు తమ భార్యలను, "క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి, … దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను" అనే విధంగా (5:25–27) ప్రేమింపవలెనను వాస్తవమునకు సంబంధించినదై యున్నదని సూచించుచున్నది. "… వలెను" అను మాట *opheilō* యొక్క అనువాదమై, "నైతిక లేదా వ్యక్తిగత కర్తవ్యమునుబట్టి ఋణపడి యుండుట" అని అర్థమిచ్చుచున్నది[28] (యోహాను 13:14 చూడుము). "తమ సొంత శరీరములనువలె" (5:28) అనగా "తనను వలె తన సొంత భార్యను ప్రేమింపవలెనని" అర్థము (5:33), ఎస్. డి. ఎఫ్. సాల్మండ్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు,

దీనిని "వారి వలె" అని తగ్గించ కూడదు ... ; సరికదా, భర్త తన భార్య యెడల కలిగియుండాల్సిన ప్రేమ అతడు తన సొంత శరీరము యెడల కలిగియున్న అదే విధమైననటువంటిదై యుండవలెనన్నట్లుగా, ఇచ్చట *hōs* ["as," "వలె"] "ప్రకారము" అని సామాన్య అర్థము నిచ్చుట లేదు. *Hōs*, దాని *నాణ్యతగల* బలమును కలిగియున్నది = "అది అయియున్నది," "ఉన్న దాని వలె" అయియున్నది. పౌలు యిదివరకే చెప్పినట్లు, *క్రీస్తు* మరియు *భర్త శిరస్సై* యున్నారు, గనుక క్రీస్తుకు సంబంధినంచినంత వరకు సంఘము ఆయన శరీరమై యున్నది, గనుక అలాగే భర్తకు సంబంధించినంత వరకు భార్య అతని శరీరమై యున్నది. కాట్టి, క్రీస్తు సంఘమును తన శరీరము గావించుకొని ప్రేమించినట్లే, భర్త శిరస్సైయున్నవాడు, తన భార్యను తన సొంత శరీరమునకువలె, ప్రేమింపబద్ధుడై యున్నాడు. భార్యాభర్తలు *ఏక శరీరమై* యుందురు అను అభిప్రాయము కూడ మనస్సులో ఉండియుండును.[29]

**వచనములు 28, 29.** సార్వత్రిక నియమముల ప్రకారము, పురుషులు తమ సొంత శరీరములను ద్వేషించుకొనిరని సృష్టి తెలుపుచున్నది. కాబట్టి, భార్యలు తమ భర్తలలో ప్రాణాధారమైనంతటి ఒక భాగమౌదురు గనక, భర్తలు తమ భార్యలను ప్రేమింప బద్ధులైయున్నారని సృష్టి వారికి తెలియజెప్పవలసి యున్నది. క్రీస్తు తన శరీరమునకు, అనగా సంఘమునకు శిరస్సై యున్నట్లే, భర్తలు తమ భార్యలకు శిరస్సులై యున్నారు. ఈ సమానాంతరమును గమనిస్తూ, భర్తలు తమ భార్యలపై ఆధిపత్యము కలిగియున్నారను భావమును పౌలు వ్యక్తము చేయుచున్నాడు. అలాగైతే, భర్తలు, తమ భార్యలను ప్రేమించుట ద్వారా, తమ్మును తాము ప్రేమించుకొనుచుందురు. భర్త తన శరీరమును పోషించుకొంటూ సంరక్షించుకొన్నట్లే, **క్రీస్తు కూడ సంఘమును పోషించి సంరక్షించుచున్న విధంగా**, అతడు తన భార్యను పోషిస్తూ సంరక్షింపవలెను.

"పోషించుట" *ektrephō* యొక్క అనువాదమై, *ek* ("నుంచి") మరియు, *trephō* గట్టిపర్చుటకు, లేక పోషకాహార మిచ్చుచు కొవ్వుపట్టించుటకు; అందు చేత, ఆహారమిచ్చుట, పరిచర్యచేయుట, పోషించుట" కలిసియున్న ఒక సంయుక్త పదమై యున్నది.[30] ఇదే ఉత్పత్యర్థ పదము 6:4లో, పిల్లలకు శిక్షణనిచ్చు సందర్భంలో "పెంచుట" అని అనువదింపబడి యున్నది. బాప్తిస్మము మరియు దేవుని వాక్యము ద్వారా సంఘము పరిశుద్ధపరచబడుటకును పవిత్రము గావింపబడుటకును (5:25–27 చూడుము), సంఘము పరిపక్వము గావింపబడుటకును (4:11–16) తగు ఏర్పాటును క్రీస్తు సమకూర్చినట్లు, భార్యల సంక్షేమాభివృద్ధిలో భర్తలు వారికి సహాయము చేయ బద్ధులై యున్నారు.

"గారాబంగా పెంచు" (*thalpō*) వేడి లేక ఆప్యాయతకు సంబంధించినదై యున్నది.[31] తన సొంత చంటి బిడ్డలకు పాలిచ్చుచు పెంచి పోషించు తల్లి గూర్చి చెప్పబడిన సందర్భములో ఇదే పదము 1 థెస్సలొనీకయులకు 2:7లో వాడబడి యున్నది. "గారాబంగా పెంచు" క్రీస్తు సంఘము యెడల వ్యవహరించు విధానములో గల మృదుత్వమును వర్ణించుచు, వారు మృదుత్వముతోను ప్రేమపూర్వకంగాను తమ భార్యల ఎదుగుదలను మరియు సంక్షేమమును పెంచి పోషింపవలెనని భర్తలకు గుర్తుచేయుచున్నది.

**వచనము 30. మనము క్రీస్తు శరీరమునకు అవయవములమై యున్నాము గనుక** అను మాటలు, క్రైస్తవులు వారి అధిపతితో (శిరస్సుతో), యేసు క్రీస్తుతో, అనగా వారు ఆయన

శరీరమై యున్నందునుబట్టి వారి గూర్చి తగు శ్రద్ధ వహించుచు వారి అవసరములను తీర్చుచుండువానితో, అనురాగసహితమైన సంబంధము కలిగియున్నారను వాస్తవమును సూచించుచున్నవి. ఇంకా, క్రీస్తు సంఘము గూర్చి ప్రేమగల మరియు పెంచిపోషించు భర్త తన పెండ్లి కుమార్తెకు సమకూర్చువానివలె తగు శ్రద్ధ వహించుచున్నాడు. ప్రతి సభ్యుడు క్రీస్తు శరీరములో, అనగా మన ప్రభువు "తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘములో" (అపొస్తులుల కార్యములు 20:28) ప్రాణాధారమైనంతటి ఒక భాగమై యున్నాడు. శరీరము క్రీస్తుకు ఎంతో విలువైనది మరియు ఆయనలో ఒక భాగమై యున్నది. ఆయన వేరుపరచబడజాలనంతగా దానికి జోడింపబడియున్నాడు గనుక దాని ప్రతి అవసరమును ఆయన తీర్చుచున్నాడు. అదే విధంగా, భర్తలు తమ భార్యలకు విలువ ఇచ్చుచు వారిని అనురాగపూర్వకంగా పెంచిపోషిస్తూ వారిని సంరక్షించు నిమిత్తము సకల విధాలా ప్రయాసపడవలసినవారై యున్నారు.

**వచనము 31. ఈ హేతువు చేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును, వారిద్దరును ఏకశరీరమగుదురు.** ఈ ఉల్లేఖనము ఆదికాండము 2:24 నుంచి తీసుకొనబడి భార్యాభర్తల మధ్య నెలకొని యుండు ఏకత్వము గూర్చి క్రైస్తవులకు ఒక అంతిమ జ్ఞాపికగా ప్రయోజనకరమై యున్నది. భర్తలు తమ భార్యలను "తమ సొంత శరీరములనువలె" మరియు భర్త "తనను వలె" తన భార్యను ప్రేమించుట గూర్చి పౌలు చెప్పాడు (5:28). ఇంకా, "తన శరీరమును ద్వేషించువాడెవడును లేడని" కూడా పౌలు చెప్పాడు (5:29). వాస్తవమునకు, భార్యాభర్తలు, "ఏకశరీరమై యున్నారని" ఆదికాండములోని వాజ్మూలము నొక్కివక్కాణించుచున్నది.

**వచనము 32.** ఆయన అలంకార యుక్తంగా చెప్పుచుండెనను ఒక జ్ఞాపికతో పౌలు ఈ విభాగాన్ని ముగించుచున్నాడు. వివాహమును గూర్చిన **మర్మము** ద్వారా, దేవుడు ఒక భర్తను మరియు ఒక భార్యను "ఏకశరీరము"గా చేసాడు. మర్మసహితమైన ఈ కలయిక **సంఘము**ను అర్థంచేసుకొనుటకు మనకు సహాయకరముగా ఉంటున్నది. దేవుడు **క్రీస్తు**ను సంఘమునకు శిరస్సుగాను, పెండ్లి కుమార్తె యొక్క పెండ్లి కుమారునిగాను చేసాడు. క్రైస్తవులు క్రీస్తు శరీరము మరియు పెండ్లి కుమార్తెయై యున్నారు.

**వచనము 33.** సంఘమునకును క్రీస్తుకును గల సంబంధమును గూర్చిన మర్మము భార్యా/భర్తల సంబంధములో ఒక ఆచరణాత్మకమైన అర్థము కలిగియున్నది. **అయితే** (*plēn*), అని పౌలు రచించినప్పుడు, నిజానికి, "భార్యాభర్తల గూర్చి నేను చెప్పుచుండిన విషయాన్నే నన్ను మళ్లీ చెప్పనివ్వండని" ఆయన చెప్పుచుండెను. ఈ మార్గదర్శక సూచనల నుంచి ఏ భర్తయైనను మినహాయింపబడలేదను సత్యమును అటుతరువాత ఆయన ఉద్ఘాటించి చెప్పాడు. **ప్రతి పురుషుడు తన భార్యను ప్రేమింపవలెనని** అపొస్తలుడు చెప్పాడు. అదే విధంగా, **భార్యయైతే తన భర్తయందు భయము కలిగియుండునట్లు చూచుకొనవలెనను** ఆజ్ఞలో ప్రతి భార్య కూడ చేరియున్నది. "మర్యాద," *phobeō* అను గ్రీకు క్రియా పదము యొక్క అనువాదమైయున్నది. దీని అర్థము "భయము"[32] అయియున్నది, అయితే అది ఒక దాసుడు కలిగియుండు భయము కాదు, కానీ "ఆత్మ త్యాగముతో ప్రేమపూర్వకంగా శిరస్సైయున్న తన భర్త యెడల గల ఒక సరైన ప్రతిస్పందనయైయున్న పూజనీయ భావముతో కూడిన భయమై"[33] యున్నది.[34]

## అదనపు అధ్యయనము కొరకు:
## సంఘ పవిత్రీకరణము (5:25–27)

ఎఫెసీయులకు 5:25–27లోని "పవిత్రపరచుట" క్రీస్తు చేసిన ఒక చర్యయై యున్నది. అదొక నిరంతరమైన లేక పునరావృతమగుచుండు చర్య కాదు. క్రైస్తవులు పరిశుద్ధతలో ఎదుగుచూ ఉన్నప్పటికిని, మనము ఇదివరకే పరిశుద్ధులమైన లేక పవిత్రపరచబడిన ప్రజలమై యున్నామని పౌలు ఉద్ఘాటించి చెప్పుచుండెను.

ఆయన "సంఘమును వాక్యముతో ఉదకస్నానము చేత కడిగినప్పుడు" క్రీస్తు ఆమెను పవిత్రపరచాడు. గతములో ఒక నిర్దిష్ట సమయమందు, క్రీస్తు సంఘమును కడుగుట ద్వారా ఆమెను పవిత్రపరచాడు. ("పవిత్రపరచి" అని అనువదింపబడిన క్రియా పదరూపము యొక్క ప్రాముఖ్యత ఇదే.) "వాక్యముతో ఉదకస్నానముచేత" అని పౌలు రచించినప్పుడు ఆయన రూపకాలంకార రీతిలో ఆలోచించుచుండెనని అభిప్రాయపడుటకు హేతువేమియు లేదు. మూల గ్రంథ పాఠమును అలంకారికంగా, సంకేత రూపంలో, లేదా ఉపమానాలంకారంగా దృష్టించుటకు స్పష్టమైన కారణముంటే తప్ప దానిని అక్షరార్థముతో వ్యవహరించుట బైబిలు అధ్యయన విధానములో ఒక చక్కని నియమమై యున్నది. నీళ్లు మరియు వాక్యము కలిసియుండిన "ఉదకస్నానముచేత" క్రీస్తు సంఘమును పవిత్రపరచాడు. ఆయన తన ప్రజల కొరకు రూపొందించుకొన్న ప్రణాళికలోని ఒక భాగంగా అక్షరార్థమైన "నీళ్లు" లేఖనముల యందంతటను కనబడుచుండును.

ఉదాహరణగా బాప్తిస్మమిచ్చు యోహాను యొర్దాను నదిలో ప్రజలకు బాప్తిస్మమిచ్చుట ద్వారా అతడు వారిని క్రీస్తు రాకడ కొరకు సిద్ధపరచాడు (మత్తయి 3:6). యేసు బాప్తిస్మమిచ్చు యోహాను చేత బాప్తిస్మము పొందిన తరువాత నీటిలో నుండి దరికి వచ్చాడు (మత్తయి 3:16). బాప్తిస్మమిచ్చు యోహాను "సలీము దగ్గరనున్న ఐనోనను స్థలమున నీళ్లు విస్తారముగా ఉండెను, గనుక అక్కడ" బాప్తిస్మమిచ్చాడు (యోహాను 3:23). "నీటి మూలముగాను **ఆత్మ** మూలముగాను జరుగు" జన్మము దేవుని రాజ్యములోనికి ప్రవేశించుటకు ఒక షరతైయున్నదని యేసు చెప్పాడు (యోహాను 3:5). యేసు గూర్చిన వర్తమానము వినిన తరువాత, ఐతియోపీయుల నపుంసకుడు ఫిలిప్పుతో, "ఇదిగో! నీళ్లు! నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమి?" అని అడిగాడు (అపొస్తలుల కార్యములు 8:36–38). తన విశ్వాసమును ఒప్పుకొనిన తరువాత, ఐతియోపీయుడు ఫిలిప్పుతో కూడ "నీళ్లలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను" (అపొస్తలుల కార్యములు 8:36–38). పేతురు కొర్నేలీకి, అన్యజనుడైనవానికి, సువార్త నందించినప్పుడు, అతడు, "... వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్లకు ఆటంకము చేయగలడా?" అని అన్నాడు (అపొస్తలుల కార్యములు 10:47).

తీతు 3:5లో, దేవుడు మనలను "... తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను" రక్షించాడని పౌలు చెప్పుచున్నాడు, ఇది 26వ వచనం గూర్చిన మంచి వ్యాఖ్యానమై యున్నది. సంఘమును క్రీస్తు "వాక్యముతో ఉదకస్నానము చేత దానిని పవిత్రపరచుట," దేవుడు మనలను "పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు

నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను" రక్షించుటకు సమానమైనదై యున్నది. మానవాళి "మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే రక్షింపబడినదనియు ... మనము ఆయన కృప వలన నీతిమంతులమని తీర్చబడి నిత్యజీవమును గూర్చిన నిరీక్షణనుబట్టి దానికి వారసులమగుటకై రక్షింపబడితిమని" తీతు 3వ అధాయయంలోని సందర్భము మనకు తెలియజెప్పుచున్నది (3:5-7). దేవుని కృప మరియు కనికరము చేత, మానవుని రక్షణ సాధ్యమయ్యింది, మరియు ఈ రక్షణ "పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను," అయోగ్యుడైన మానవునికి ఒక యథార్థమైన సొత్తైయ్యింది.

"పునర్జన్మసంబంధమైన స్నానము" (2 కొరింథీయులకు 5:17) ఒకడు క్రైస్తవుడగుటకు అంతిమ మెట్టైయున్నదని అలెగ్జాండర్ కేంప్‌బెల్ ధృవీకరించాడు.[35] ఈ చర్య బాప్తిస్మమై యున్నదని ఆది గ్రీకు సంఘ పితరులు అర్థంచేసుకొన్నారని చూపించుటకు చరిత్రకారుడైన యూసిబియస్‌ను ఉదహరించి చెప్పాడు.[36] దీనిని వ్యాఖ్యానకర్తలలో అధికులు అంగీకరించుచున్నారు. "పునర్జన్మ సంబంధమైన స్నానము," "శరీరములు నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన" దానికి (హెబ్రీయులకు 10:22) లేక "నీటి మూలముగా జన్మించిన" దానికి (యోహాను 3:5) సమానమైనదై యున్నదనియు, నోవహు నీటి వలన రక్షింపబడినట్లు, "ఇప్పుడు మనలను బాప్తిస్మము రక్షించునని" (1 పేతురు 3:21) కూడ కేంప్‌బెల్ రూఢిపర్చాడు. "పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట," "వాక్యముతో చేయబడు ఉదకస్నానమునకు" సమానమైనదై యున్నదని కూడ కేంప్‌బెల్ ప్రకటించాడు "ఏలయనగా పరిశుద్ధాత్మ, వాక్యము ద్వారా మనలను ప్రతిష్ఠించును లేక పవిత్రపరచును"[37] (యోహాను 15:3).

ఎఫెసీయులు పరిశుద్ధులుగాను, పవిత్రులుగాను చేయబడినట్లే, వారు కడుగబడినట్లే, కొరింథీయులు కూడా పరిశుద్ధులుగాను, పవిత్రులుగాను చేయబడిన, కడుగబడ్డారని పౌలు 1 కొరింథీయులకు 6:11లో చెప్పుచున్నాడు. ఈ రెండు రిఫరెన్సులు కూడ, నిస్సందేహంగా, "మీ పాపముల క్షమాపణ కొరకైన" (అపొస్తలుల కార్యములు 2:38), "క్రీస్తు నందుండుట" కొరకైన (రోమీయులకు 6:3; గలతీయులకు 3:27), "ఒక్క శరీరము నందుండుట" కొరకైన (1 కొరింథీయులకు 12:13) నీటి బాప్తిస్మమునకు సంబంధించినవై యున్నవి. చరిత్రలో ఒక నిర్దిష్ట కాలమందు, సంఘము కొరకు తన ప్రాణము నర్పించుటకు క్రీస్తు తనను తాను అప్పగించుకొన్నాడు. ఆయన సంఘములోని ప్రతి సభ్యుడు, ఒక నిర్దిష్ట సమయంలో, పాపమునకును స్వయంనకును చచ్చినవాడై, బాప్తిస్మమందు తనను తాను క్రీస్తునకు అప్పగించుకొనవలెను. అప్పుడు వాడు నూతన జీవమునకు పునరుత్థానము గావింపబడును (రోమీయులకు 6:4 చూడుము). ప్రతి క్రైస్తవుడు వ్యక్తిగతముగా కడుగబడును, అలాగే సంఘము, అనేక అవయవములున్న శరీరము కూడా, కడుగబడును.

## సరైన మార్గములో నడుచుకొనుట (2:1-10; 4:1, 17; 5:2, 8, 15)

"నడుచుకొనుట" జీవించుటకు సంబంధించిన ఒక రూపకాలంకారమై యున్నది. క్రైస్తవులమైన మనము, ఎలా మరియు ఎవరితో కూడా నడుచుకొనుచున్నామో చూచుకొనుటకు, అతి జాగ్రత్తపరులమై యుండవలెను.

*మనము లోకం పోకడ ప్రకారము నడుచుకొన కూడదు* (2:2). ఈ లోక మర్యాదను అనుసరిస్తూ నడుచుకొనువారు నశించినవారై యున్నారు; వారు ఐహికమైన, దేవుని నుండి అన్యాక్రాంతమైన ఈ లోకమునకు చెందినవారై యున్నారు. వారు దేవుని రాజ్యమునకు విరుద్ధంగా నున్న రాజ్యములో భాగమై యున్నారు.

*మనము అపవాది అడుగుజాడల్లో నడుచుకొన కూడదు* (2:2). నశించిన ఆత్మలు సాతానుతో, "వాయు మండల సంబంధమైన అధిపతితో" మరియు "అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతితో" సత్సంబంధముగలవై యున్నవి. వారి జీవితములు తిరుగుబాటుతనముతో ఏలబడుచున్నవి.

*మనము శరీరాశల ననుసరించు నడుచుకొన కూడదు* (2:3). నశించినవారు, వారు జీవించవలెనని దేవుడు కోరుచున్న విధానములో గాక దానికి బదులుగా, వారు సొంత ప్రగాఢావేశముల చొప్పున జీవించుదురు.

*మనము ఉగ్రత పిల్లలముగా నడుచుకొన కూడదు* (2:3). నశించినవారు ఆదాము స్వభావము, పాపిష్టియైన "మానవ స్వభావము" చొప్పున జీవించుదురు, మరియు దేవుని ఉగ్రతకు పాత్రులగుదురు. రోమీయులకు 1:18 ఇలా హెచ్చరించుచున్నది, "దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనత మీదను దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకము నుండి బయలుపరచబడుచున్నది."

*మనము తగినట్లుగా నడుచుకొనవలెను* (4:1). "వారు [మనము] పిలువబడిన పిలుపునకు తగినట్లుగా" జీవించవలెనని పౌలు క్రైస్తవులను విన్నవించుకొన్నాడు. మనము ఆయన కృప మరియు మహిమకు తగినట్లుగా నడుచుకొనవలెనని దేవుని పరిశుద్ధమైన పిలుపును అందుకొన్నాము (1 థెస్సలొనీకయులకు 2:12; 2 తిమోతి 1:9 చూడుము). మనము అంధమైన మనస్సుతో నడుచుకొన కూడదు (4:17). నశించినవారు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వము లేకుండా జీవించుచున్నారు. క్రీస్తు ఉద్దేశంతో జీవించాడు, గనుక మనము ఆయన మాదిరిని అనుసరించినట్లయితే ధన్యులమౌదుము (1 పేతురు 2:21; 3:9 చూడుము).

*మనము ప్రేమ కలిగి నడుచుకొనవలెను* (5:2). దేవుడు ప్రేమయై యున్నాడు (1 యోహాను 4), గనుక ఆయనను పూర్ణ హృదయముతోను, ఆత్మతోను, మనస్సుతోను ప్రేమించుట మన అతి గొప్ప లక్ష్యమై యున్నది. ఇంకా, మనలను మనము ప్రేమించుకొన్నట్లే మనము ఇతరులను ప్రేమింపవలెను (మత్తయి 22:37-39 చూడుము).

*మనము వెలుగు సంబంధులవలె నడుచుకొనవలెను* (5:8). మనము యిక మీదట "అంధకారములో" నడుచుకొన కూడదు ఏలయనగా, మనము ఇప్పుడు "ప్రభువునందు

వెలుగై” యున్నాము.

*మనము జ్ఞానుల వలె నడుచుకొనవలెను* (5:15, 16). చేయగల శక్తిసామర్థ్యములు మనకున్నప్పుడే, ఇప్పుడే, మన జీవిత కాలమును ప్రభువును సేవించుటలో గడుపవలెను (యోహాను 9:4 చూడుము).

జేయ్ లాక్‌హార్ట్

**పరిశుద్ధాత్మతో నింపబడిన జీవితము (5:18-21)**

పాత నిబంధనలో, దేవుడు తన ప్రజల కొరకు ఒక దేవాలయమును ఏర్పాటు చేసాడు; క్రొత్త నిబంధనలో, దేవుడు తన ప్రజలనే ఆయన ఆలయముగా కలిగియున్నాడు. ఒకడు క్రొత్తగా జన్మించినప్పుడు (బాప్తిస్మము పొందినప్పుడు), ప్రతి క్రైస్తవుడు జీవముగల దేవుని ఆలయమౌతాడు. పెంతెకొస్తు దినాన, పేతురు, “మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురని” పలికాడు (అపొస్తలుల కార్యములు 2:38). మనము తిరిగి జన్మించినవారమైనట్లయితే, మనలో ఒకరు అంటారు – దేవుని పరిశుద్ధాత్మ ఉంటాడు. దైవికమైన ఈ ప్రక్రియ బాప్తిస్మ సమయములో మాత్రమే మొదలౌతుంది; క్రైస్తవుడు అనుదినము దేవుని పరిశుద్ధాత్మతో జీవించుచుండును.

వారు “ఆత్మపూర్ణులై యుండవలెనని” (5:18) పౌలు ఎఫెసీయులకు ఒక సలహాను సూచించాడు. ఇదొక ఐచ్ఛికము కాదు; ఇదొక ఆజ్ఞ. పరిశుద్ధాత్మతో నింపబడి యుండుట మనము ఆధ్యాత్మికంగా అతీతమైనవారమై యుండుటకు ఏదో ఒకటి చేసే విషయం కాదు: అది తిరిగి జన్మించిన దేవుని ప్రతి బిడ్డ యొక్క బాధ్యతయై యున్నది. మనము పరిశుద్ధాత్మతో *నింపబడవలసినదే.*

దైవికమైన ఈ కర్తవ్యమును మనము నెరవేర్చుచున్నామని మనకెలా తెలుస్తుంది? వారు దినదిన వర్ధమానముగా పరిశుద్ధాత్మతో నింపబడుచున్నారని చెప్పుకొనదగువారి గురుతులు ఏమై యున్నవి? ఈ ఆజ్ఞను మనకు 18వ వచనం తెలియజెప్పుచుండగా, పరిశుద్ధాత్మతో నింపబడిన విశ్వాసిని గుర్తించగలుగుటకు తరువాతి వచనములు మనకు మూడు గుణగణములను చూపించుచున్నవి. అసమాపక క్రియా పదములుగా, కొనసాగుచుండు చర్యను సూచించునవిగా అవి మూల గ్రీకు గ్రంథ పాఠములో సూచింపబడినవి.

పరిశుద్ధాత్మతో నింపబడినవారిని గుర్తించగలుగుటకు గల మూడు గురుతులేమై యున్నవి?

*ఒకరితో నొకరు ఆరాధనా స్ఫూర్తితో “మాటలాడుకొనుట.”* “ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుట” (5:19).

మనము పాటలు పాడుట దేవుని యెడల మనకు గల ప్రేమను ప్రతిబింబిస్తుంది; అదొక ఆరాధనా భావ అభివ్యక్తమై యున్నది. ఆనందభరితమైన ఆరాధనలో అదొక భాగం. దేవుని స్తుతించుటలో గల మన ఆనందం అవధులు తెంచుకొని పొంగిపొర్లుతుంది. దేవుని, మన విమోచకుని యెడల గల పూజనీయమైన మరియు కృతజ్ఞతా భావంతో బిగ్గరగా కేకలు వేయాలని మన ఆత్మలు తహతహలాడును.

మనము మాటలాడుకొనుట "కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతోను కూడినదై యుండునని" పౌలు సెలవిచ్చాడు. ప్రయోగింపబడుచున్న ఈ పదముల తేడాల గూర్చి మనము అంత పట్టింపుగా ఆలోచించాల్సిన అవసరం లేదు, అట్లయిన్నటికి ఎంతో కొంత వ్యత్యసము ఉండవలెను. "కీర్తనలు," పాత నిబంధనలోని, ఆది సంఘము యొక్క పాటల పుస్తకములోని, కీర్తనలై యున్నవి. దేవుని సొంత ప్రేరేపణ గల స్తుతుల పుస్తకంలో నుండే మనము ఆయనను స్తుతింపవలెనని పౌలు ఆజ్ఞాపించుచున్నాడు. మన మనోగతులు, దుఃఖములు లేక సంతోషములు ఏమైయున్నను, మన సమస్యలు ఏమైయున్నను, మన అనుభూతులను అభివ్యక్తము చేయుటకు మనకు ఒక కీర్తన లభిస్తుంది.

"సంగీతములు," దేవునికి స్తుతులు చెల్లించు పాటలై యున్నవి. సంగీతము విశిష్టంగా ఒక క్రైస్తవ ఉత్పాదనయై యుండగా, కీర్తనలు యూదా మతములో నుంచి సంఘమునకు అందించబడినవి.

"ఆత్మసంబంధమైన పాటలు," కొంచెము తక్కువ సాంప్రదాయకమైన పాటలై యుండి, మన నమ్మకములను, సంతోషములను, మరియు కృతజ్ఞతా స్తుతులను వ్యక్తము చేయును. ఇవి ఒక తరము నుండి మరొక తరమునకు అందింపబడిన సంగీతములు మరియు కీర్తనల కంటె అధికంగా వ్యక్తిగతమైనవై యున్నవి.

మనము మన హృదయములలో పాటలు పాడుచు కీర్తించవలసినవారమై యున్నాము. "పాటలు పాడుచు కీర్తించుచు" అని అనువదింపబడిన గ్రీకు పదము వాస్తవముగా మనము ఆరాధించుచున్నప్పుడు హృదయ నాడులను తాకుట అను అర్థము నిచ్చుచున్నది. మనము యథార్థముగా దేవునికి స్తుతులొనర్చుటకు హృదయము మన సాధనమై యున్నది.

దేవుని ఆరాధించుటకు గల మన ప్రోత్సాహకము "ప్రభువున కర్పింపబడు" మాటల్లో కనబడుతుంది. పాటలు పాడుట అనగా మనలను మనము పొగడుకొనుట కాదు, లేదా మనమందరము మన కంఠస్వరాలను ఎంత చక్కగా మల్చుకొనగలమో చూచుకొనుట అంతకన్నా కాదు. మన విమోచకుడైన వాని యెడల యథార్థమైన గౌరవమును తెలుపుచూ ఆయనను స్తుతించుటయే కీర్తనలతోను, సంగీతములతోను, మరియు ఆత్మసంబంధమైన పాటలతోను కీర్తించుటలో గల మన ప్రాథమిక ప్రోత్సాహకమై యున్నది.

*మేళ్లను తలపోసికొనుచు దేవునికి "కృతజ్ఞతా స్తుతులు చెల్లించుట."* "మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడు కృతజ్ఞతా స్తుతులు చెలించుట" (5:20).

మనము పాటలు పాడునప్పుడు దేవునితో మనకు గల సంబంధమెలాంటిదో తెలుస్తుంది, అలాగే కృతజ్ఞతా స్తుతులు చెల్లించుట ద్వారా మనము మన పరిస్థితుల పట్ల ఎలా ప్రతిస్పందిస్తున్నామో ప్రతిధ్వనింపబడుతుంది. మనము పరిశుద్ధాత్మతో నింపబడియున్నప్పుడు, సమస్త విషయములలో మనము కృతజ్ఞత గల మనస్సును కుమ్మరించుదుము.

ఇది ఎటువంటి కృతజ్ఞతాస్తుతియై యున్నది? అది దాని నేతృత్వములో సరైనదైయున్న కృతజ్ఞతయై యున్నది: "తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట." "ఈ రోజు నేనెంతో అదృష్టవంతుణ్ణి" అని కొందరు చెప్పునప్పుడు, మనము సంబంధిత పరపతిని

దేవునికి ఆరోపింపవలెను. మనము "ఎల్లప్పుడు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు" కృతజ్ఞతగలవారమై యుండవలెను.

ఇంకా, "సమస్తమును గూర్చి" అంటూ పౌలు తన ఉపదేశమును కొనసాగించుచున్నాడు. మనము మన జీవితాల్లో ఎదురయ్యే మంచి విషయాలకు ఎంతో సులభంగా దేవునికి వందనములు చెల్లిస్తాము. అయితే, జీవితములో ఎదురయ్యే కష్టాల మాటేమిటి? సంభవించే సంఘటనలన్నీ ఎందుకలా సంభవిస్తున్నాయో మనకు అర్థం కాకపోవచ్చును, కానీ వాటిలోంచి మంచి కలుగునని మనము యింకను నమ్మవచ్చును.

*భయముతో ఒకనికొకడు లోబడియుండుట.* "క్రీస్తు యెడల గల భయముతో ఒకనికొకడు లోబడియుండుడి" (5:21; NIV).

"లోబడుట"లో మనము ఒకరితో నొకరము కలిగియుండు సంబంధములు ముడిపడి యున్నవి. పౌలు తన పత్రికను రచించుచుండినప్పుడు, "లోబడియుండుడి" అను పదము సైనికపరమైందిగా వాడబడింది. ఒకడు తన సమాన హోదాలో ఉన్నవాని క్రింద తనను తాను సమానముగా ఉంచుకొనుట అనునది దాని అక్షరార్థమై యున్నది. దానికి న్యూనతా భావముగల సహజార్థము లేదు. కుమారుడైన దేవుడు తండ్రియైన దేవునికి లోబడ్డాడు. ఆయన సంపూర్ణముగ తండ్రియైన దేవునితో సమాన హోదాగలవాడై యుండెను, కానీ ఆయన స్వచ్ఛందంగా లోబడ్డాడు.

భార్యలు తమ భర్తలకు లోబడవలసియున్నది - కానీ అది ఈ సూత్రమును ప్రదర్శించుట మాత్రమే. ఆచరణాత్మకంగా లోబడి యుండవలెనని ఉపదేశింపబడినది వారు మాత్రమే కాదు. ప్రతి క్రైస్తవుడు లోబడియుండవలెను. మనము క్రీస్తునందలి మన తోటి సహోదర సహోదరీలకు ఎంత మేరకు వినయముతో లోబడుచుందుమో, అంత మేరకు మనము పరిశుద్ధాత్మతో నింపబడుచుందుము. కొందరు సహోదరులు వారి క్రైస్తవ జీవితంలో తడబడుచుందురు ఏలయనగా వారు తమ హక్కుల కోసం పోరాడుచుందురు. ఒకడు తన సొంత హక్కులకై సాధికారంతో పోరాడుచుండునంత వరకు, వాడు పరిశుద్ధాత్మ అధీనమునకు తననుతాను వశము చేసికొనజాలడు. మనము స్వయంనకు చచ్చినవారమై యున్నాము (గలతీయులకు 2:20 చూడుము). చచ్చిపోయినవానికి యిక హక్కులేముంటాయి?

ఒక క్రైస్తవుడు మరొక క్రైస్తవుని అధికారము క్రిందకు ఎందుకు వస్తాడు? వానికి పరిచారము చేయుటకే. కొందరు **ఆత్మ**పూర్ణులై యుండాలని ఆశపడుదురు కానీ యేసు నామంలో ఎవరైనా మరొకరికి సహాయం చేయడానికి ముందడుగు వేయరు. "మేము మమ్మును గూర్చి ప్రకటించుకొనుట లేదు, గాని క్రీస్తు యేసును గూర్చి ఆయన ప్రభువనియు మమ్మును గూర్చి యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నామని" పౌలు చెప్పుచున్నాడు (2 కొరింథీయులకు 4:5). మనము ప్రేమ కలిగి ఒకనినొకరము సేవించుకొనుచుండవలెను.

"క్రీస్తు యెడల గల భయముతో ఒకనికొకడు లోబడి యుండుడని" పౌలు చెప్పుచున్నాడు (NIV) యేసునుబట్టి మనము ఒకరికొకరము లోబడియుందుము. ఆయన ఇతరులకు పరిచారము చేసాడు; ఆయన మనకు మాదిరి ఉంచాడు. ఆత్మపూర్ణులై యుండుట అనగా యేసు వలె ఉండుటయే.

*ముగింపు.* మనము పరిశుద్ధాత్మతో నింపబడినప్పుడు, మనలో పెత్తనం చెలాయించునదేమిటో, మనలను అధీనములో ఉంచుకొన్నదెవరో, లోకము గమనించుచుండును. దీనిని మనము మన నోటి మాటలు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట, మరియు లోబడుట ద్వారా ఇతరుల యెదుట ప్రదర్శించగలము.

**మన కృతజ్ఞతాస్తుతులు (5:20)**

మనము 5:20 చదువునప్పుడు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటకు సమస్తము కలిసియున్న మార్గదర్శక సూత్రమును చూడగలము:

మర్గదర్శకములో సరైనది: "తండ్రియైన *దేవునికి* కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట."

కాల వ్యవధిలో ఎడతెగనిది: "*ఎల్లప్పుడు* కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట."

పరిమాణములో సంపూర్తియైనది: *"సమస్తమును గూర్చి."*

**అత్యున్నత స్థితికి తీసికొనిరాబడిన వివాహము (5:21–33)**

మనము చూస్తూ ఉన్నట్లుగా ఇన్ని వివాహ బంధములు ఎందుకు విచ్ఛిన్నమౌతున్నాయి? ఎందుకు, తమ దాంపత్య జీవితమును కొనసాగించుచుండు దంపతులలో, గగ్గోలు పుటించునంతటి శాతం దంపతులు వారి వివాహమును "సంతోషభరితమైనదిగా" పరిగణించరు? అది స్త్రీపురుషులు వారి జీవితాలను పంచుకొనవలెనని దేవుడు వేసిన ప్రణాళికా విధానము కాదు. ప్రతి భర్త, ప్రతి భార్య తమ వైవాహిక జీవితంలో సంతోషభరితమైన వాతావరణమును సృష్టించుకొనుచు, వారి శాయశక్తులా ఉండగలిగినంతటి ఉత్తమమైన క్రైస్తవులై యుండవలెననుదే దేవుని కోరికయై యున్నది.

పౌలు 5:21–33లో, మనము మన దాంపత్య జీవిత భాగస్వామితో సంతోషకరమైన సంబంధము కలిగియుండునట్లు మనకు సహాయకరముగా ఉండగల కొన్ని సూక్తులనిచ్చాడు. భర్త గూర్చిన దేవుని ప్రణాళిక, భార్య యొక్క శిరస్సుగా, అతడు ప్రేమగల నాయకుడై యుండుట; భార్య గూర్చిన దేవుని విధానము, విశ్వసనీయమైన అనుయాయురాలై యుండుట.

*భర్తల గూర్చిన దేవుని ఆధిపత్యము.*

(1) భర్త శిరస్సై యున్నాడు (5:23). భార్య తన భర్తకు లోబడి యుండుట గూర్చి పౌలు మాటలాడినప్పుడు, భర్త తన భార్యపై పెత్తనం చెలాయించుట గూర్చి ఒక్క మాటైనను ఆయన చెప్పలేదు. "భర్తలారా, మీ భార్యలు మీకు లోబడునట్లు చేసుకొనుడి! వారిపై పెత్తనం చెలాయించుడంటూ!" ఆయన ఎన్నడు వ్రాయలేదు. ఇదే విధమైన విషయమును ఆయన కొంచెముగానైనను వ్రాయలేదు.

భర్త "భార్యకు శిరస్సై యున్నాడు" అని చెప్పుటలో గల అర్థమేమిటి? అతడు నాయకుడై యుండవలెను. కుటుంబములో తన స్థానమేమై యున్నదో సరైన విధంగా అర్థంచేసుకొనని ఏ భర్తయైనను కష్టాలను ఎదుర్కొంటాడు. తన భార్య అతనికి లోబడునట్లు ఆమెను బలవంతంగా భయపెట్టుటకు ప్రయత్నించు ఏ భర్తయైనను క్రీస్తు తన పెండ్లి కుమార్తె, సంఘము ఆయనకు లోబడునట్లు ఎలా తీసికొనివచ్చాడో తెలిసికొనవలెను. ఆజ్ఞల గూర్చిన గొంతెత్తి అరుచుట ద్వారా కాదు, కానీ సంఘమును ప్రేమించుట ద్వారా మరియు సంఘము

కొరకు తన ప్రాణము నర్పించుట ద్వారా సంఘము ఆయనకు లోబడునట్లు చేసాడు. వారి వైవాహిక జీవితం అత్యున్నత స్థితిలో ఉండవలెనని ఆశించు భర్త క్రీస్తు చూపిన మాదిరిని అనుసరించవలెను.

భర్తకు తన ఇంటిలో గల హక్కులు, అధికంగా జనసంచారములో అతనికుండు హక్కుల వంటివే. ఉదాహరణ కొన్ని పర్యాయములు, అతడు మోటారు వాహనమును తోలునప్పుడు, "నేనే ముందు వెళ్లాలి, మీరందరు ప్రక్కకు తొలగండి" అని సాధికారంతో అడుగుటకు అవకాశం లేదు. జనసంచార కూడలిలోని సంకేతం అతడు ముందుకు వెళ్లవచ్చునని సూచించుచున్నప్పటికిని, అతని ప్రక్కగా ఏదైన ఒక భారీ వాహనము వేగాన్ని తగ్గించకుండానే వచ్చుచున్నట్లయితే, 'ఏమైనా సరే నేను ముందుకు వెళ్తానని" తన హక్కును ఉపయోగించుకొనజాలడు! ఉపయోగించుకుంటే, ప్రమాదమే!

వారి హక్కుల కోసం పోరాడుటలో కొందరు భర్తలు తప్పు చేస్తారు. వారు పెత్తనం చెలాయించాల్సిందే, వారు పౌరుషంగలవారై యుండి వారనుకున్నదే చేస్తూ వారి అధికారాన్ని బలవంతంగానైనా రుద్దాల్సిందే అని వారు నమ్ముదురు. అయితే ఫలితం, వారి వివాహం విచ్ఛిన్నమౌతుంది. కుటుంబంలో భర్తకు దేవుడిచ్చిన స్థానం అతడొక నియంతగా ఉండుట కాదు, కానీ ప్రేమ గల ఒక నాయకుడై యుండుటయే.

(2) క్రీస్తు శిరస్సై యున్నట్టుగానే, భర్త కూడ శిరస్సై యున్నాడు (5:23). భర్త ఒక నియంతగా ప్రవర్తించనట్లయితే, అతడు తన కుటుంబాన్ని ఎలా నడిపించగలడు? సంఘమును "క్రీస్తు నడిపించినట్లే." "వలె" (అట్లే) అను ఈ చిన్న పదమును వదిలిపెట్టి దాటిపోవద్దు. కీలకము అదే. తన కుటుంబ భారము వహించుటకు సంపూర్తి బాధ్యత గల భర్త "లోబడాల్సిందే!" అని పలుకుచూ, బైబిలును ఒక దుడ్డుకర్రగా ప్రయోగింపకూడదు.

తన పెండ్లి కుమార్తె ఆయనకు లోబడవలసిందేనని యేసు ఎన్నడైనా ఆమెను బలవంతం చేసాడా? చేసియున్నట్లయితే, సంఘము కచ్చితంగా భిన్నంగా ఉండేదే. నిజానికి, సంఘములోని అనేక మంది సభ్యులు ఆయనకు లోబడుట లేదు. యేసు తన పెండ్లి కుమార్తెను ఎలా నడిపించుచున్నాడు? ఆయన ఆమెను బతిమాలుచున్నాడు మరియు ఆయన ఆమె కొరకు తన ప్రాణము నర్పించాడు; ఆయన ఆమెను ప్రేమించుచున్నాడు. 5:24 ప్రకారం, సంఘము క్రీస్తుకు లోబడుచుండగా, భార్య సమస్త విషయములలో తన సొంత భర్తకు లోబడి యుండవలెను. యేసు తన సంఘమును నడిపించుచున్న నమూనాకు భర్త తన సొంత పెండ్లి కుమార్తెను నడిపించుటకు అవసరమైయున్న నాయకత్వమును అనుగుణ్యము చేసుకొన్నప్పుడే అది సాధ్యమౌతుంది.

(3) క్రీస్తు ప్రేమించినట్లే, భర్త కూడ తన భార్యను ప్రేమింపబద్ధుడై యున్నాడు (5:25).

*నిస్వార్థమైన ప్రేమ.* క్రీస్తు తన పెండ్లి కుమార్తెను, సంఘమును ఎలా ప్రేమించాడు? ఆయన ఆమెను *నిస్వార్థముగా* ప్రేమించాడు, ఏలాగనగా ఆమె కొరకు ఆయన తనను తాను అప్పగించుకొన్నాడు. క్రీస్తు తన సొంత కోరికలకు మరియు అవసరములకు ప్రథమ ప్రాధాన్యత నివ్వలేదు. అలా చేసియుండినట్లయితే, ఆయన మహిమతో కూడిన బంగారు వీధులను ఎన్నడును విడిచిపెట్టేవాడు కాదు. దానికి బదులుగా, యేసు తన పెండ్లి కుమార్తె అవసరములకు ప్రథమ ప్రాధాన్యత నిచ్చాడు. "ఏలయనగా మనుష్యకుమారుడు పరిచారము

చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెనని" ఆయన పలికినప్పుడు, తన సొంత నిస్వార్థమైన ప్రేమను ఉత్తమంగా వ్యక్తము చేసాడు (మార్కు 10:45)

ఒక పురుషుడు వివాహం చేసుకొన్నప్పుడు, తన సొంత అవసరములపైనే దృష్టి సారించుటకు అతనికి గల హక్కును గూర్చిన ఆశలు వదులుకొనును. అతడు తన భార్యను వివాహం చేసుకొన్నాడు గనుక అతడిప్పుడు ఆమెతో ఒక్క శరీరమయ్యాడు. ఇక మీదట అతడు చేయగోరుచుండు వాటి ప్రకారమే తీర్మానములు సామాన్యంగా తీసికొనజాలడు. సంఘము కొరకు క్రీస్తు తనను తాను అప్పగించుకొన్నాడు, గనుక భర్త తన భార్య కొరకు తనను తాను అప్పగించుకొనవలెను. భర్త తీసికొను ప్రతి తీర్మానంలో ఆమె సంక్షేమము ప్రధానాంశమై యుండవలెను. అతడు ఆమెను నిస్వార్థముగా ప్రేమింపబద్ధుడై యున్నాడు.

*త్యాగపూరితమైన ప్రేమ.* భర్త తన భార్యను *త్యాగపూరితముగా* ప్రేమింపవలెను, ఏలయనగా సంఘము కొరకు క్రీస్తు మరణించాడని బైబిలు బోధించుచున్నది. ఆయన ఈ కార్యమును అక్షరాలా, వాస్తవంగా, మరియు సంపూర్తిగా చేసాడు. భర్త తన భార్య కొరకు "మరణిస్తే" తప్ప, యేసు తన పెండ్లి కుమార్తెను ప్రేమించినట్లే, అతడు తన భార్యను ప్రేమించలేడు. అనగా, అతడు తన "స్వయం"నకు మరణించాలి. తన సొంత విషయాలను గాని విధాలను గాని పట్టుబట్టి అమలు చేయుటకు అతడు చచ్చినవాడై యుండవలెను.

యేసు సంఘము కొరకు మరణించుట మాత్రమే కాదు, కానీ సంఘము సంఘముకాక మునుపే, సభ్యులు తమకు తాము మరణించి క్రీస్తు కొరకు సజీవులు కావలసినవారై యుండిరి. కుటుంబాల్లో అత్యధికంగా అవసరమయ్యేదేంటి? వాటికి రెండు చావులు మరియు ఒక్క వివాహం కావాలి! భార్య తనకు తాను చనిపోతుంది; భర్త తనకు తాను చనిపోతాడు. భర్త తన భార్యను త్యాగపూరితంగా ప్రేమించుటకు ఇష్టపడుచున్నాడు. "నా భార్య నిమిత్తము మానివేయుటకు నాకు ఏదియు అంతగా ప్రశస్తమైంది కాదని!" అతడు చెప్పును.

*పవిత్రపరచు ప్రేమ.* ఇంకా ఎంతో ఉన్నది. యేసు కూడ తన పెండ్లి కుమార్తెను పవిత్రపరచు ప్రేమతో ప్రేమించాడు: "... అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి పరిశుద్ధపరచుటకై దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను" (5:25-27).

క్రీస్తు ఏంచేయాలని ఆశిస్తున్నాడు? తన పెండ్లి కుమార్తెను పవిత్రపరచాలి, అందంగా తీర్చిదిద్దాలి. అలాగైతే ప్రేమ గల నాయకుడై యుండాలని ఆశించు **ఆత్మ**పూర్ణుడైయున్న భర్త చేయాల్సిన పనేంటి? తన భార్యను అందరూ ఆకర్షింపబడునంతటి అందగత్తెగా చేయుటయే.

భర్త తన భార్యను నడిపించుచు, ఆమెకు ఉపదేశించుచు, ఆధ్యాత్మికంగా ఆమెను కాపాడుచు ఆమెను పవిత్రపరచవలెను. ఆమె అతనితో వాదోపవాదములు చేయునట్లు లేదా ఆమె కోపపడి పాపము చేయునట్లు పురికొల్పి ఆ తరువాత ఆమె రాజీపడాల్సిన పరిస్థితిలోనికి అతడు ఆమెను ఎన్నడును తీసికొనివెళ్లడు. ఆమెను కళంకపర్చు ఏ విషయాన్నైనా అతడు చేయడు. ఆమె జీవితం అపవిత్రపరచబడు ఏ విషయానికైనను ఆమెను బహిరంగము

చేయడు. పవిత్రపరచు ప్రేమతో అతడు తన భార్యను ప్రేమించును.

*తృప్తిపరచు ప్రేమ.* అతడు తన భార్యను తృప్తిపరచు ప్రేమతో కూడ ప్రేమింపవలసినవాడై యున్నాడు: "అటువలెనే పురుషులు కూడా తమ సొంత శరీరములనువలె తమ భార్యలను ప్రేమింప బద్ధులై యున్నారు" (5:28).

పురుషుడు తన సొంత శరీరం విషయంలో ఏంచేస్తాడు? దానిని తృప్తిపరచుటకు ప్రయత్నింస్తాడు. దాహమైనప్పుడు, అతడు నీళ్లు త్రాగును. ఆకలైనప్పుడు, అన్నం తినును. గాయమైనప్పుడు, కట్టు కట్టును. అతడు తన భార్యను కూడా ఇదే విధంగా ప్రేమింపవలెను ఆమె అవసరములేమిటో కనిపెట్టి ముందుగానే తెలిసికొనుచు వాటిని తీర్చుచు ఆమెను తృప్తిపరచవలెను. ఇలా చేసే ఏ భర్తకైనను, వారి వైవాహిక జీవితమంతటిలో భార్య యొక్క ప్రతి అవసరాన్ని తీర్చుచుండు ఏ భర్తకైనను లోబడకుండా అతనికి విరోధంగా తిరుగుబడుటకు ఏ భార్యయైనను సాహసించదు.

అతని భార్య తన సొంత శరీరము యొక్క పొడిగింపై యున్నదని గాక, ఆమె అతనికి ఏదో ఒక సొత్తైయున్నదని భర్త ఎంచుట కొన్ని వివాహాల్లో ఒక పెద్ద సమస్యయై యుంటున్నది. కాబట్టి ఈ సొత్తు పాతదైపోగానే, మరొక క్రొత్త సొత్తైతే బాగుండుననుకుంటాడు. దీనికి తారతమ్యంగా, తన భార్యతో కూడ దాంపత్య జీవితము గడుపుచు కాలము గడుచుకొలది వృద్ధిడగుచుండు భర్త, ఆమె అంతరంగములోని అందచందాలు అంతకంతకు మెరుగౌతున్నట్లు గమనిస్తాడు గనుక ఆమెను యింకా ఎక్కువగా ప్రేమిస్తూ ఆమె గూర్చి అధిక శ్రద్ధ వహిస్తాడు. తన భార్య అవసరమలను తీర్చని భర్త ఆధ్యాత్మికంగా ఆత్మహత్య చేసుకొనుచున్నవాడౌతాడు ఎందుకనగా అతడు ఆమెతో కూడా ఒక్క శరీరమై యున్నాడు.

*సర్వోచ్ఛమైన ప్రేమ.* చివరగా, వైవాహిక జీవితంలో, పురుషుడు తన భార్యను *సర్వోచ్ఛంగా* ప్రేమింపవలెను: "ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును, వారిద్దరును ఏకశరీరమగుదురు" (5:31).

ఈ లోకంలో ఎన్ని బంధాలున్నా, అన్నిటి కంటె ముందు ఒక పురుషుని వివాహం ప్రధాన్యమైన మొదటిబంధమై యుండవలెను. భార్యాభర్తల మధ్య నుండు సంబంధాన్ని పౌలు, ఆధ్యాత్మిక సంబంధాలన్నింటిలో అత్యున్నతమైనదైన, క్రీస్తునకును సంఘమునకును మధ్యనున్న సంబంధంతో పోల్చుచున్నాడు. ఒక తల్లి మరియు తన బిడ్డకు మధ్య నుండునది కాదు, కానీ ఒక భర్త మరియు తన భార్యకు మధ్య నుండునదే మానవ బంధాలన్నింటిలో అత్యున్నతమైన బంధమై యున్నది.

*భార్యల కొరకు దేవుని విధానము.*

(1) అవసరత: "స్త్రీలారా, ... మీ సొంతపురుషులకు లోబడి యుండుడి" (5:22). "లోబడి యుండుట" అనగా, ఒకడు మరొకని అధికారము క్రింద స్వచ్ఛందంగా తనను తాను ఉంచుకొనుట అని అర్థం. భార్య ప్రాపంచిక మనస్సుగలదైనట్లయితే, తన భర్తకు లోబడి యుండుట గూర్చిన ఈ సూత్రమునకు ఆమె తిరుగబడుతుంది. లోకము ఆలోచించు విధానంలో ఆమె ఎంత ఎక్కువగా ఆలోచిస్తుందో, లోబడుటకు అంత ఎక్కువగా నిరాకరిస్తుంది.

**ఆత్మ**పూర్ణులైనవారు దేవుడు వారి మీద అధికారములో ఉంచినవారికి లోబడి యుండుటకు ఇష్టపడుదురు. 21వ వచనం ఇలా సెలవిస్తుంది, "క్రీస్తునందలి భయముతో

ఒకనికొకడు లోబడియుండుడి." లోబడి యుండుట స్త్రీలకు మాత్రమే వర్తించదు; అది సకల క్రైస్తవులకు వర్తిస్తుంది. కుటుంబములో, భార్య తన సొంత భర్తకు లోబడి యుండవలెనని బైబిలు చెప్పుచున్నది.

షేక్స్పియర్ ఇలా రాసాడు, "ఒకే గుఱ్ఱంపై ఇద్దరు స్వారీచేస్తూ వున్నా, వారిలో ఒకడు తప్పనిసరిగా మరొకని వెనుక ఉండాల్సిందే."[38] ఇది న్యూనభావంతో కూడిన స్వారీ కాదు కానీ ఆచరణాత్మకమైన అవసరంతో కూడిన విషయమై యున్నది. అలాగే, కుటుంబములో కూడా, అది అసమానత లేదా న్యూనతా భావానికి సంబంధించిన విషయం కాదు; అది ఆచరణాత్మకమైన అవసరమై యున్నది. "వెనుక స్వారీ చేయాల్సింది" భార్యేనని దేవుడు నిర్ణయించాడు.

భార్యలు బాహ్య రూపంలో మాత్రమే లోబడుచున్నట్లయితే, వారు తమ భర్తలకు లోబడుచున్నవారు కారని అర్థమగుచున్నది. బైబిలు బోధలకు సంబంధించి లోబడి యుండుటలో, బాహ్య రూపంలోను అంతరంగ వైఖరిలోను లోబడుట కలిసి యున్నవి. దేవుడు ఆశించుదానిని నెరవేర్చునది ఇదే.

(2) కారణం: "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు, క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (5:23). భార్యకు తన కుటుంబములో దేవుడు ఇటువంటి అవసరతను ఎందుకు పెట్టాడు? భార్య లోబడి యుండుటకు గల కారణమేమనగా, భర్త తన భార్యకు శిరస్సై యుండవలెనని దేవుడు ఏర్పరచాడు (ఆదికాండము 3:16 చూడుము). ఇది శిక్ష నిమిత్తమైనది కాదు, కానీ ఒక ఉద్దేశము కొరకే. దేవుడు, అపరిమితమైన ఆయన జ్ఞానం చొప్పున, ఏదో ఒక క్రమము లేనట్లయితే – అది సమాజంలోనైతేనేమి, ప్రభుత్వంలోనైతేనేమి, లేదా కుటుంబములోనైతేనేమి – అల్లకల్లోల పరిస్థితి అతి త్వరలో తలెత్తుతుందని ఎరిగియుండెను. ఇద్దరు యజమానులు గల ఒక కుటుంబము త్వరలో దానికదే విరోధంగా తిరుగుబడుతుంది, విభజింపబడుతుంది, ఆ తరువాత అది కూలిపోతుంది. భర్త కుటుంబమునకు శిరస్సై యుండాలని దేవుడు ఏర్పాటు చేసాడు. "ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తనియు, స్త్రీకి శిరస్సు పురుషుడనియు, క్రీస్తునకు శిరస్సు దేవుడనియు మీరు తెలిసికొనవలెనని కోరుచున్నానని" పౌలు రచించాడు (1 కొరింథీయులకు 11:3). దేవుని "ఆజ్ఞా గొలుసు" ఇదే.

కుమారుడైన దేవుడు తండ్రియైన దేవునితో సమానుడై యున్నాడు. ఫిలిప్పీయులకు 2:5–7లో ఇలా వ్రాయబడి యున్నది, "క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి, ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొని తన్ను తానే రిక్తునిగా చేసికొనెను." దేవుని కుమారుడు తండ్రియైన దేవునికి స్వచ్ఛందంగా లోబడ్డాడు – ఏదో అసమానతనుబట్టి కాదు, కానీ సఫలీకృతమైన మానవాళి విమోచన నిమిత్తము అది దేవుని ఆజ్ఞా గొలుసులో అవసరమై యుండింది.

తన భర్తకు లోబడి యుండని భార్య జీవితంలో అనేక సమస్యలను అనుభవిస్తుంది. మొదటిదిగా, *దేవునితో* ఆమెకు ఒక గంభీరమైన సమస్య ఏర్పడుతుంది. భార్య తన భర్త యొక్క నాయకత్వమునకు లోబడి యుండుటకు నిరాకరించినప్పుడు, ఆమెకున్న

ఆసలు సమస్య తన భర్తతో కాదు. అది దేవునితోనే, ఆమె అతనికి లోబడియుండవలెనని చెప్పినవానితోనే. కాబట్టి, ఆమె ఆధ్యాత్మికపరమైన సమస్యలను ఎదుర్కొంటుంది: తన ప్రార్థనా జీవితంలో సమస్యలు, బైబిలు అధ్యయనంలో, మరియు తండ్రియైన దేవునికిని ఆమెకును గల సంబంధంలో.

లోబడనొల్లని భార్య తన *భర్తతో* కూడా కష్టాలను ఎదుర్కొంటుంది. భార్య తన భర్త యొక్క అధికారమును గౌరవించుటకు నిరాకరించినప్పుడు, ఆమె వారి ఏకశరీరము సంపూర్తియగునట్లు దానిని బలపర్చుటకు బదులుగా దుర్బలము గావిస్తుంది. కుటుంబ నాయకుడుగా దేవుడు తనకు అప్పగించిన భాధ్యతలను నెరవేర్చవలెనని ఆశించు భర్త మనస్సులో గందరగోళం సృష్టిస్తుంది. ఆమె అతనిని వెంబడించనట్లయితే అతడు ఆమెను నడిపించజాలడు.

ఆమె *పిల్లలు* సహితము ఆమెకు తలనొప్పిగా మారుదురు. తన భర్త ఆధిపత్యము క్రింద నుండుటకు నిరాకరించు భార్యను ఆమె పిల్లలు ఎన్నడు ఆమెను సరైన రీతిలో గౌరవించరు. పిల్లలు తమ తల్లిదండ్రులకు లోబడియుండవలెనని బైబిలు బోధించుచున్నది, కానీ ప్రస్తుత పరిస్థితిలో వారు ఎటువంటి తల్లికి లోబడాల్సివుంటుంది? పిల్లలు, పరిశుద్ధాత్మతో నింపబడిన భర్తకు లోబడుచు, పరిశుద్ధాత్మతో నింపబడిన తల్లికి లోబడవలసినవారై యున్నారు. తల్లే తిరుగుబాటుతనము గలదై తీవ్రముగా స్వతంత్రురాలైనట్లయితే, ఈ పరిస్థితినంతా గమనించుచుండు పిల్లలు సహితము ఆమె యెడల అదే విధంగా ప్రతిస్పందించుటకు అవకాశములు మెండుగానున్నవి. ఆమె చేయని విషయాలను తన పిల్లలు చేయవలెనని ఆమె ఆశించజాలదు, శాసించజాలదు.

ఇటువంటి భార్య *తనతో సహితము స్వయం* సమస్యలను ఎదుర్కొంటుంది. దేవుడు తనకిచ్చిన బాధ్యతల విషయంలో ఆమె తిరుగబడుచున్నదని తెలుసుకొంటుంది. ఈ వాస్తవము గూర్చిన ఎరుక ఆమె ఆత్మను వేధిస్తుంది. అంతమాత్రమేగాక, ఆమె తన భర్త నాయకత్వమునకు లోబడుచు ఆమె అవసరములను తీర్చుటకు తన భర్తకు స్వేచ్ఛనివ్వనంత వరకు కూడా భార్యకు ఎన్నడును పూర్తిగా తీర్చబడని కొన్ని అవసరములుంటాయి.

(3) ఫలితం: "సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలు కూడ ప్రతి విషయములో తమ పురుషులకు లోబడవలెను" (5:24). అనేక మంది స్త్రీలు పౌలు ఆదేశముల గూర్చి చిరచిరలాడుచుందురు. ఇటువంటి వైఖరిగల వారు జీవితంలో ఒక గొప్ప సూత్రమును అంతగా పట్టించుకొనలేదు: లోబడి యుండుట వలన స్వాతంత్ర్యము కోల్పోబడదు; అది నిజమైన స్వేచ్ఛనిస్తుంది. ఒకవేళ భర్త అవిశ్వాసియైనట్లయితే లేదా దేవుని ఉపదేశములను బాహాటంగా ఉల్లంఘించువాడైనట్లయితే? "ప్రతి విషయములోను" లోబడి యుండుటలో ఈ విషయం కూడా ఉన్నదా? ఇచ్చట ఒక సామాన్యమైన మార్గదర్శక సూత్రమివ్వబడుచున్నది: విషయము/పరిస్థితి దేవుని చిత్తమును ఉల్లంఘిస్తే **తప్ప** భార్య ప్రతి విషయంలోను లోబడి యుండవలెను. ఆమె తన భర్త తీసికొను తీర్మానములతో ఏకీభవించుచున్నదా లేదా అను దానిపై ఈ ఆజ్ఞ ఆధారపడుట లేదు; ఆమె ఏదైన ఒక పని చేయవలెనని తన భర్త అడిగినప్పుడు అది ఆమెకు అనుకూలమైయ్యింది లేదా ఆమె ఇష్టపడునదైతేనే ఆమె లోబడవలసిన విషయం కూడా కాదు. ఆమె చేయవలెనని తన భర్త నిర్దేశించు విషయము/ చర్య దేవుని పరిశుద్ధ ప్రమాణమునకు విరుద్ధమైనదై యుండు సూత్రము మాత్రమే, ఆమె

తన భర్తకు లోబడి యుండవలసిన బాధ్యత నుంచి ఆమెకు విడుదలను కలిగిస్తుంది.

పేతురు యేసును ప్రకటించ కూడదని అతని ఆదేశములిచ్చినవారు తన కాలమందునండిన మత సంబంధమైన నాయకులతో పేతురు ఇలా చెప్పాడు, "దేవుని మాట వినుట కంటె మీ మాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? మీరే చెప్పుడి; మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేము" (అపొస్తలుల కార్యములు 4:19, 20). మానవ అధికారము యెడల చూపవలసిన విధేయత దేవుని ఆజ్ఞల యెడల చూపవలసిన విధేయతతో ఘర్షణ పడినట్లయితే, క్రైస్తవ విశ్వాసి మొదట దేవుని అధికారమును గౌరవించవలెను.

క్రైస్తవురాలైన భార్య అవిశ్వాసియైన తన భర్త నాయకత్వమునకు లోబడియుండవలెనని పేతురు ఆమెకు ఆదేశములిచ్చాడు (1 పేతురు 3:1, 2). ఏది ఏమైనా, పేతురు "ప్రతి విషయములోను" అను పదజాలమును ప్రయోగింపలేదు. అతడు దానిని విడిచిపెట్టాడు, ఏలయనగా అవిశ్వాసియైన భర్త ఆమె లోబడుటకు సమ్మతించజాలని పనులు చేయవలెనని విశ్వాసియైన భార్యను కోరవచ్చునని పేతురు ఎరిగియుండెను.

5:24లో, భార్యలు తమ భర్తలకు "ప్రతి విషయములోను" లోబడవలెనని పౌలు చెప్పినప్పుడు, ఆ సందర్భమేమిటో స్పష్టముగా తెలియుచున్నది, పరిశుద్ధాత్మతో నింపబడిన భార్య యొక్క సంబంధము పరిశుద్ధాత్మతో నింపబడిన భర్తతో ఎటువంటిదై లేక ఏమై యుండవలెనో పౌలు ఆమెకు తెలియజెప్పుచుండెను. ఇటువంటి భర్త దేవుని చిత్తమునకు విరోధమైన ఏ విషయమునైనను తన భార్య చేయవలెనని ఆమెను ప్రోత్సాహించడు. కాబట్టి, పరిశుద్ధాత్మతో నింపబడిన భార్య తన భర్తకు "ప్రతి విషయములోను" లోబడి. యుండగలదు మరియు లోబడి యుండవలెను. ఇలా చేయుట ద్వారా మాత్రమే ఒక్కశరీరమగు తన భర్త పొడిగింపును ఆమె పూర్తి చేయుచున్నదౌతుంది గనుక ఆమెకు యథార్థమైన తృప్తి మరియు భద్రత లభించును.

*ముగింపు.* భర్త తన భార్య యెడల కలిగియుండవలసిన ప్రేమ ఐచ్ఛికమైంది కాదు. యేసు తన సంఘమును ప్రేమించుచున్నట్లే భర్త తన భార్యను ప్రేమించుటకు శ్రద్ధాభక్తితో ప్రయాసపడినట్లయితే, అతడు తన భార్యలో ఒక నూతనమైన మరియు తాజదనముగల బంధమును కనుగొంటాడు. అప్పుడు తన భర్తకు లోబడియుండవనలెనని ఆమె ప్రయత్నించు తరుణంలో, ఇరువురును దేవుని చిత్తప్రకారమైన మరియు అత్యున్నతమైన వైవాహిక ఆనందానుభూతులను అనుభవించుదురు.

క్రిస్ బుల్లార్డ్

**భర్త పాత్ర (5:23-31)**

5:23-31 ప్రకారము, భర్తలు తమ భార్యల యెడల సరైన గౌరవమును మరియు మర్యాదను మూడు విధాల్లో ప్రదర్శించవలెను:

*తమ భార్యలకు ఆధ్యాత్మిక నాయకత్వమును సమకూర్చవలెను* (5:23). భర్తలు వారి భార్యలకు "శిరస్సై" యున్నారనునది వాస్తవమై యున్నదనంటే, భర్తలు నాయకులై యున్నారు గనుక వారి ఆధ్యాత్మిక నాయకత్వమును భార్యలు అంగీకరించవలెనని అర్థము.

"అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి దాని కొరకు తనను తాను

అప్పగించుకొన్నట్లే" భర్తలు ఆత్మత్యాగపూరితమైన అనురాగంతో *తమ భార్యలను ప్రేమింపవలెను* (5:25). వారు తమ సొంత అవసరముల కంటె అధికంగా తమ భార్యల అవసరముల గూర్చి చింతించుచుండవలెను.

ఈ ప్రేమ శాశ్వతకాలము నిలుచునదై యున్నది (5:25–27). భర్తలు తమ భార్యలను బలపర్చుచు వారిని ప్రోత్సాహించవలెను. క్రీస్తు ప్రేమనుబట్టి వారు ఎదురుచుండునట్లు సంఘ సభ్యులు సమర్థవంతులు గావింపబడుచున్నట్లే, భార్యలు తమ భర్తలు లేకుండా ఉన్నప్పటి కంటె ఉత్తమ వ్యక్తులగుదురు.

ఈ ప్రేమ పెంచిపోషిస్తూ సంరక్షించు ప్రేమయై యున్నది (5:28–30). "సంరక్షించుట" అను పదము విలువ మరియు ఆప్యాయతతో కూడిన అనుభూతులను సూచిస్తుంది (1 థెస్సలొనీకయులకు 2:7 చూడుము). "పెంచిపోషించుట" అను పదము ఒక తోటలోని మొక్కలు ఎదుగునట్లు వాటి పట్ల చూపింపబడు శ్రద్ధ గూర్చి చెప్పుచున్నది. తోటమాలి మొక్కలు నాటి, వాటికి ఎరువులు వేస్తూ, నీళ్లు పోయుచుండును, అలాగే భర్తలు తమ భార్యల సంక్షేమము గూర్చి తగు సాగుబడి చేయుచుండవలెను. భర్తలు తమ భార్యలను పెంచిపోషిస్తూ సంరక్షించున్నప్పుడు. వారిని అర్థంచేసుకొనుటకు ప్రయత్నిస్తూ వారిని గౌరవిస్తారు (1 పేతురు 3:7 చూడుము). కుటుంబములో తమ భార్యలు సహితము ప్రాముఖ్యమైనవారే యని భర్తలు ఆ యా విధాలుగా చూపించుచుండవలెను.

*వారు తమ భార్యల యెడల విశ్వసనీయమైనవారై యుండవలెను* (5:31). భార్యాభర్తలు "ఏకశరీరము" అయ్యారు. వారు ఒకరి యెడల మరొకరు కలిగియుండు విశ్వసనీయత వారి జీవితాంతము వరకు నిలిచియుండవలెను.

జేయ్ లాక్‌హార్ట్

---

సూచనలు

[1]Spiros Zodhiates, ed., *The Complete Word Study New Testament,* 2d ed. (Chattanooga, Tenn.: AMG Publishers, 1991), 869. [2]Kenneth S. Wuest, *Wuest's Word Studies from the Greek New Testament for the English Reader: Ephesians and Colossians* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1953), 126. [3]Ethelbert W. Bullinger, *A Critical Lexicon and Concordance to the English and Greek New Testament* (London: Samuel Bagster and Sons, n.d.; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, Regency Reference Library, 1975), 154. [4]Wuest, 126. [5]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph Henry Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 220. [6]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 982. [7]Wuest, 127. [8]Zodhiates, 948. [9]Andrew T. Lincoln, *Ephesians,* Word Biblical Commentary,vol. 42 (Dallas: Word Books, 1990), 346. [10]Josephus *Antiquities* 7.12.3.

[11]Bullinger, 761. [12]Wuest, 227. [13]M. C. Kurfees, *Instrumental Music in the Worship* (Nashville: Gospel Advocate Co., 1950), 16. Studies of singing written by Owen D. Olbricht, Hugo McCord, and Jack P. Lewis are included in "Worship," *Truth for Today* (March 2003): 27–31 and "The Question of Instrumental Music," *Truth for Today* (March 2008). [14]Kurfees, 48. [15]Zodhiates, 964. [16]Wuest, 129. [17]Lincoln, 365. [18]Wuest, 130. [19]Zodhiates, 942. [20]Lincoln, 368.

[21]Ibid., 372. [22]Ibid., 373. [23]Wuest, 131. [24]Ibid., 132. [25]Zodhiates, 928. [26]Lincoln, 377. [27]Ibid. [28]Zodhiates, 942. [29]S. D. F. Salmond, "The Epistle to the Ephesians," in *The Expositor's Greek Testament,* ed. W. Robertson Nicoll (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 3:370–71. [30]Bullinger, 537.

[31]Ibid., 146. [32]Ibid., 279. [33]J. A. Robinson, *St. Paul's Epistle to the Ephesians,* 2d ed. (London: Macmillan & Co., 1904), 127. [34]Lincoln, 385. [35]Alexander Campbell, *The Christian System* (St. Louis: Christian Publishing Co., 1835), 231. [36]Eusebius Pamphilus *The Life of the Blessed Emperor Constantine* 4.62. [37]Campbell, 232. [38]William Shakespeare *Much Ado About Nothing* 3.5.